www.mudranews.in

# ముద్ర

పాఠకులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

హైదరాబాద్
సోమవారం, 26.01.2026

@mudranews
mudratv

సంపుటి:13
సంచిక: 99
పేజీలు: 12
వెల: రూ. 5

Published From: Hyderabad Amaravathi Vijayawada

## ఇదో విచిత్రమైన ముద్ర



ఈజిప్టులోని వైట్ డెజర్ట్ నేషనల్ పార్క్ (కైరో నుండి సుమారు 550 కి.మీ దూరంలో ఫరాఫ్రా దగ్గర) ఒక అద్భుతమైన ప్రకృతి సౌందర్యం ఉంటుంది. ఫరాఫ్రా డిప్రెషన్ అని కూడా పిలిచే ఈ ప్రాంతం గాలి తుపాన్లతో చెక్కబడిన చాక్ రాతి నిర్మాణాలతో ప్రసిద్ధి చెందింది. ఇవి వేరే లోకానికి చెందినట్లుగా కనిపిస్తాయి. పశ్చిమ ఎడారిలోని ఒక ప్రత్యేక అద్భుతం!

# పురపోరుకు 27న నోటిఫికేషన్?

### తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా




- 27న ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఏర్పాట్లు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో కీలక సమావేశం
- ఫిబ్రవరి 11న పోలింగ్‌కు అనుకూల వాతావరణం
- పారదర్శక ఎన్నికల కోసం ప్రత్యేక శిక్షణ
- పరిశీలకుల పాత్ర కీలకం: రాణి కుముదిని
- 32 జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- పోలింగ్ కేంద్రాలు, భద్రతపై ప్రత్యేక దృష్టి
- ఓటర్ల జాబితా సవరణ పూర్తి
- పురపోరుకు సిద్ధమైన రాజకీయ పార్టీలు

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగేందుకు రంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏడు నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాలకు ఎన్నికల షెడ్యూల్‌ను ఈ నెల 27న సాయంత్రం ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తోంది.
27వ తేదీ ఉదయం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఎన్నికల తుది ఏర్పాట్లపై సమీక్షించిన అనంతరం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు ఫిబ్రవరి 15లోపు మొత్తం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహించేందుకు అనుకూలంగా భావిస్తున్నారు. నోటిఫి

మిగతా 02లో

### మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ గ్రౌండ్ వర్క్

సమన్వయకర్తల్ని నియమించిన కేటీఆర్



- రాష్ట్రంలోని 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లకు పార్టీ ప్రత్యేక సమన్వయకర్తల నియామకం
- 123 పురపాలికలకు కోఆర్డినేటర్ల జాబితాను విడుదల చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02

### 'పుర'పోరులోనూ కాంగ్రెస్ దే విజయం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



- అన్నీ మున్సిపాలిటీలు హస్తగతం చేసుకుంటాం
- నిజామాబాద్ లోకసభ నియోజకవర్గ నేతలతో భేటీ

09



### రైతు చెంతకే భూధార్

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- సర్వే వ్యవస్థలో విప్లవం
- క్షేత్రస్థాయిలోకి లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- పాత పద్ధతులకు స్వస్తి.. ఆధునిక 'రోవర్స్' తో కొలతలు

02

### ప్రపంచ పర్యాటక కేంద్రంగా తెలంగాణ

పర్యాటకమే ఆర్థిక ఇంజిన్

- నవ శకం.. పర్యాటక పాలసీ-2025-30
- బహుముఖ అభివృద్ధిపై దృష్టి
- పెట్టుబడులకు ఆహ్వానం
- పెట్టుబడుల ఆకర్షణగా తెలంగాణ టూరిజం పాలసీ
- సీఎం రేవంత్ రెడ్డి

02



జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని పరుగులు పెట్టించడంతో పాటు, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా కొత్త పర్యాటక విధానాన్ని (2025-30) తీసుకువచ్చామని ఆయన స్పష్టం చేశారు.

ముద్ర, తెలంగాణ బ్యూరో :

# 45 మందికి పద్మ పురస్కారాలు

### తెలంగాణ నుంచి మామిడి రామరెడ్డికి వరించిన అవార్డులు

### పాడి, పశుసంవర్ధక విభాగాల్లో చేసిన సేవలకు గుర్తింపు

*గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించింది. ఈసారి 5 మందికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ అవార్డులు లభించాయి. తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నోరి దత్తాత్రేయుడు కు పద్మభూషణ్ దక్కింది. అలాగే సైన్స్ అండ్ టెక్నాలజీ, వైద్య, పశు సంవర్ధక, కళా రంగాల్లో సేవలకుగాను పలువురు తెలుగు ప్రముఖులకు పద్మశ్రీ వరించింది. యూజీసీ మాజీ ఛైర్మన్ మామిడాల జగదీశ్ కుమార్ కు ఢిల్లీ కోటాలో పద్మశ్రీ లభించింది.*

-ముద్ర, తెలంగాణ బ్యూరో:

03



# ప్రమాదం.. విషాదం

### నాంపల్లి అగ్నిప్రమాదంలో ఐదుగురి సజీవ దహనం

- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- ఫర్నీచర్ షాపు ఓనర్ సతీష్ బచా అరెస్ట్
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- 22 గంటలు సాగిన రెస్క్యూ
- దట్టమైన పొగలతో సహాయకచర్యల్లో జాప్యం
- అగ్ని ప్రమాదంపై ప్రభుత్వం సీరియస్
- అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

10



*నాంపల్లి స్టేషన్ రోడ్డులో జరిగిన అగ్ని ప్రమాదం హైదరాబాద్‌ను విషాదంలో ముంచింది. సెల్లార్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఫర్నీచర్ షాపులో చెలరేగిన మంటలు నాలుగు అంతస్తులకు వ్యాపించి ఐదుగురిని సజీవదహనం చేశాయి. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉండటం హృదయాలను కలచివేస్తోంది. దట్టమైన పొగల మధ్య 22 గంటల పాటు సాగిన రెస్క్యూ ఆపరేషన్ అనంతరం విషాదకర నిజం వెలుగులోకి వచ్చింది. ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందిస్తూ మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించగా, నిర్లక్ష్యానికి బాధ్యుడైన షాపు యజమానిని పోలీసులు అరెస్ట్ చేశారు.*

-ముద్ర, హైదరాబాద్:

# పట్టణంలో అసలు పంచాయతీ

### కీలకమవుతున్న పురపోరు

- మూడు పార్టీలకూ ముచ్చెమటలు
- కాంగ్రెస్ లో వివాదాల వ్యవహారం
- కేటీఆర్ కు సోదరి పోరు
- కాషాయంలో అర్బన్ లొల్లి
- బీసీ రిజర్వేషన్లపైనే అసలు కథ
- 42 శాతం ఇస్తామని హామీలు
- ఇప్పటికే అధికారికంగా 32 శాతం
- 10 శాతం అదనంగా ఇచ్చేనా..?




ముద్ర, తెలంగాణ బ్యూరో:

రాష్ట్ర రాజకీయాల్లో పురపోరు కీలకంగా మారింది. పట్టణ ఓటర్ల నాడి ఎటువైపు ఉంటుందో తేలనున్నది. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని బీఆర్ఎస్ గంపెడాశలు పెట్టుకుంది. గత ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలకు తోడు తమ పాలనలో సంక్షేమ పథకాలపై అధికార కాంగ్రెస్ బల నిరూపణకు సిద్ధమవుతున్నది. ఇక, గ్రామాల్లో ఇంకా తమ ప్రాబల్యం పెంచుకోవాలని, పట్టణాల్లో మాత్రం తమదే ఆధిపత్యం అని కాషాయ దళం కాలరెగరేస్తున్నది. మూడు ప్రధాన పార్టీలు తమ పట్టుకోసం పట్టణ ఓటర్లను వలలో వేసుకునే ప్రయత్నాల్లో ఉంటే.. కొత్త పార్టీ పెడుతానంటూ ప్రకటించిన జాగృతి కవిత.. తాము ఓట్లు చీల్చుతామని, తమకు కూడా గెలుపు అవకాశాలున్నాయని, పార్టీ ఇంకా ఖరారు కాకపోవడంతో ఏదైనా గుర్తు మీద పోటీ చేసి తమ సత్తా చూపిస్తామంటూ అంచనా వేస్తున్నారు. తనను ఏ పార్టీ నుంచి బయటకు పంపించారో.. అదే పార్టీ ఓట్లను చీల్చి తన బలం చూపించుకునేందుకు ప్లాన్ వేస్తోంది. ఇవన్నీ రాజకీయపరమైన అంశాలైతే.. మూడు ప్రధాన పార్టీలకు

మిగతా 02లో

# అభిషేక్ శర్మ ఊచకోత

### టీమిండియా భారీ విజయం

న్యూజిలాండ్‌తో మూడో టీ20లో భారత్ విజయం

154 పరుగుల లక్ష్యాన్ని 10 ఓవర్లలో ఛేదించిన భారత్



# టెండర్ ఎందుకు రద్దుచేశారు?

### సైట్ విజిట్ పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే



*సింగరేణి బొగ్గు గనుల టెండర్ల వేదికగా తెలంగాణలో భారీ కుంభకోణం జరుగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బావమరిది సృజన్ రెడ్డికి లబ్ధి చేకూర్చేందుకే నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు సంచలన ఆరోపణలు చేశారు. 'సైట్ విజిట్' పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త దందాను తెరపైకి తెచ్చిందని, అర్హత గల కంపెనీలను కాదని తన అనుయాయులకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన మండిపడ్డారు. సింగరేణి లాభాలను ప్రచారాలకు వాడుకుంటూ కార్మికుల పొట్ట కొడుతున్నారని విమర్శించిన హరీష్ రావు.. ఈ మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.*

-ముద్ర, తెలంగాణ బ్యూరో:

02

# మెగాను కాపాడేందుకు హరీశ్ పాట్లు

### జాగృతి అధ్యక్షురాలు కవిత

- మెగా కృష్ణారెడ్డి కోసమే నైనీ టెండర్లు
- ఈ వ్యవహారంలో సృజన్ రెడ్డి చిన్న చేప
- అవినీతి తిమింగలానికి అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ ఆవేదన
- హరీశ్ రావును నమ్మిన కేటీఆర్ ప్రెస్ మీట్ పెట్టారు
- నేను కాంగ్రెస్ లో చేరను

02





సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.01.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






**మొదటి ప్రపంచ యుద్ధం (1914–1918)**

యూరప్ కేంద్రంగా ప్రారంభమైన ఈ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. సుమారు 1.6 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయారు, ప్రపంచ రాజకీయ పటమే మారిపోయింది.

# పురపోరుకు రంగం సిద్ధం

**(మొదటి పేజీ తరువాయి)**
కేషన్ వెలువడిన 15 రోజుల్లో పోలింగ్ జరగగా, రెండు రోజుల్లో ఫలితాలు వెల్లడించే అవకాశ ముంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల వారీగా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సుల ద్వారా ఎన్నికల సంఘం సమీక్షలు నిర్వహిస్తోంది. చివరగా ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాల అధికారులతో సమావేశమై కీలక దిశానిర్దేశం చేసింది. శనివారం సాధారణ ఎన్నికల పరిశీలకులు, సాయంత్రం వ్యయ పరిశీలకులతో సమావేశాలు జరగనున్నాయి. హైదరాబాద్‌లోని ఎన్నికల సంఘం కార్యాలయంలో సాధారణ, వ్యయ పరిశీలకులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఖర్చుల నియంత్రణ, ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలు, క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడంపై అవగాహన కల్పించారు. మున్సిపల్ శాఖ కమిషనర్ డాక్టర్ టీకే శ్రీదేవి, ఎస్ఈసీ కార్యదర్శి లింగ్యా నాయక్ ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన సాంకేతిక అంశాలను వివరించారు.
శిక్షణ అనంతరం 32 జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాణి కుముదిని కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బంది ఎంపికను పూర్తి చేయాలని, మౌలిక సదుపాయాలతో కూడిన పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సున్నిత ప్రాంతాల మ్యాపింగ్, బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు తదితర సామగ్రి సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాల కలెక్టర్లు ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉందని, శాంతిభద్రతల పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని నివేదించారు. ఓటర్ల జాబితా సవరణ, వార్డుల వారీగా ఓటర్ల విభజన ఇప్పటికే పూర్తయిన నేపథ్యంలో క్షేత్రస్థాయి పనులపై అధికారులు దృష్టి సారించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ అదే ఊపును మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగించాలని భావిస్తోంది. మరోవైపు, ఇతర పార్టీలు కూడా సత్తా చాటేందుకు వ్యూహాలు రచిస్తున్నాయి. షెడ్యూల్ ప్రకటనతో తెలంగాణలో పురపోరు మరింత రసవత్తరంగా మారనుంది.



**1. మున్సిపల్ కార్పొరేషన్ల (మేయర్) రిజర్వేషన్లు:**

| కార్పొరేషన్ | రిజర్వేషన్ కేటగిరీ |
|---|---|
| జీహెచ్ఎంసీ (GHMC) | జనరల్ మహిళ |
| వరంగల్ (GWMC) | అన్‌రిజర్వ్‌డ్ (ఓసీ) |
| కరీంనగర్ | బీసీ (జనరల్) |
| నిజామాబాద్ | జనరల్ మహిళ |
| ఖమ్మం | జనరల్ మహిళ |
| రామగుండం | ఎస్సీ (జనరల్) |
| కొత్తగూడెం | ఎస్టీ (జనరల్) |
| మహబూబ్‌నగర్ | బీసీ మహిళ |
| నల్గొండ | జనరల్ మహిళ |
| మంచిర్యాల | బీసీ (జనరల్) |

**2. మున్సిపాలిటీల (ఛైర్‌పర్సన్) రిజర్వేషన్లు:**
మొత్తం 121 మున్సిపాలిటీలలో రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి.
**బీసీ (BC):** 38 మున్సిపాలిటీలు.
**ఎస్సీ (SC):** 17 మున్సిపాలిటీలు.
**ఎస్టీ (ST):** 05 మున్సిపాలిటీలు.
**అన్‌రిజర్వ్‌డ్ (OC):** 61 మున్సిపాలిటీలు (ఇందులో 31 మహిళలకు కేటాయించారు).

**తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు 2026**
రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. తాజా సమాచారం ప్రకారం జనవరి చివరి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

**నోటిఫికేషన్:** రాష్ట్ర ఎన్నికల సంఘం (SEC) జనవరి నెలాఖరులోపు ఎన్నికల షెడ్యూలును విడుదల చేసే అవకాశం ఉంది.
**ఎన్నికల స్థానాలు:** మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి.
**పోలింగ్ తేదీ:** ఫిబ్రవరిలో పోలింగ్ జరిగే అవకాశం ఉందని, ఫిబ్రవరి 15లోపు ప్రక్రియ మొత్తం పూర్తి కావాలని ప్రభుత్వం భావిస్తోంది.
**రిజర్వేషన్లు:** ఇప్పటికే మేయర్, చైర్‌పర్సన్ పదవుల రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. ఇందులో మహిళలకు 50 % సీట్లు కేటాయించారు.

**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు - 2026**
రాష్ట్రంలోని మొత్తం 121 పురపాలికలు , 10 నగరపాలక సంస్థలకు రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ గ్రౌండ్ వర్క్

- **సమన్వయకర్తల్ని నియమించిన కేటీఆర్**
- **రాష్ట్రంలోని 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లకు పార్టీ ప్రత్యేక సమన్వయకర్తల నియామకం**
- **123 పురపాలికలకు కోఆర్డినేటర్ల జాబితాను విడుదల చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం భారత రాష్ట్ర సమితి అగ్రనాయకత్వం సమరశంఖం పూరించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు మరియు కార్పొరేషన్ల వారీగా ప్రత్యేక సమన్వయకర్తలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేయడం, ఎన్నికల వ్యూహాలను పకడ్బందీగా అమలు చేయడమే లక్ష్యంగా ఈ నియామకాలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీకి ఒక సీనియర్ నాయకుడిని ఎన్నికల ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు. వీరు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి ముగిసే వరకు ఆయా మున్సిపాలిటీల్లోనే అందుబాటులో ఉండి, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను ఏకం చేస్తారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను రూపొందించడం, గెలుపు గుర్రాలైన అభ్యర్థులను గుర్తించి అధిష్టానానికి నివేదించడం వీరి ప్రధాన విధి. అభ్యర్థుల ఎంపికలో స్థానిక నాయకత్వంతో చర్చించి, సమన్వయం చేసే కీలక బాధ్యతను కూడా కేటీఆర్ వీరికి అప్పగించారు. పార్టీ రూపొందించిన ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు, బూత్ లెవల్ ఏజెంట్లను సమన్వయం చేయడంపై వీరు ప్రత్యేక దృష్టిసారిస్తారు. ఎన్నికల సరళి మరియు గ్రౌండ్ రిపోర్టులను ఎప్పటికప్పుడు తెలంగాణ భవన్ లోని పార్టీ కేంద్ర కార్యాలయానికి, వర్కింగ్ ప్రెసిడెంట్‌కు నివేదించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ మేరకు సమన్వయకర్తల పూర్తి జాబితాను కేటీఆర్ అధికారికంగా విడుదల చేస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు శ్రమించాలని పిలుపునిచ్చారు.

## రైతు చెంతకే 'భూధార్'..

- **సర్వే వ్యవస్థలో విప్లవం**
- **క్షేత్రస్థాయిలోకి లైసెన్స్‌డ్ సర్వేయర్లు**
- **పాత పద్ధతులకు స్వస్తి.. ఆధునిక 'రోవర్స్'తో కొలతలు**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ముద్ర, ఖమ్మం:**
రాష్ట్రంలో అన్ని రకాల భూములకు సంబంధించి ప్రతి అంగుళాన్ని డిజిటలైజ్ చేసి, యజమానులకు శాశ్వత యాజమాన్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 'ధరణి' ద్వారా సృష్టించిన చిక్కుముడులను విప్పుతూ.. రైతులకు చుట్టంలా ఉండేలా 'భూభారతి' చట్టాన్ని అమలులోకి తెచ్చామని ఆయన వెల్లడించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ (ఐడీఓసీ)లో శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలోని టేపులు, గొలుసుల పద్ధతులకు స్వస్తి పలికి, సెంటీమీటర్ల తేడాతో ఖచ్చితత్వం వచ్చేలా 'రోవర్స్' సాంకేతికతను వాడుతున్నామని చెప్పారు. ఇప్పటికే ఆరొందల రోవర్లను కొనుగోలు చేసి జిల్లాలకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన 5,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను మండలాల వారీగా భూ విస్తీర్ణం ప్రాతిపదికన కేటాయించినట్లు వివరించారు. ఖమ్మం జిల్లాలో రెండో విడతలో అర్హత సాధించిన 47 మందికి నియామక పత్రాలు అందజేశామని, వీరంతా పారదర్శకతతో పనిచేయాలని సూచించారు. ధరణిలో జరిగిన లోపాలపై ఇప్పటికే సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు. ఆ నివేదికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 31 జిల్లాల్లోనూ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని, ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



# పట్టణంలో అసలు పంచాయతీ

**(మొదటి పేజీ తరువాయి)**
మాత్రం రిజర్వేషన్ల భయం పట్టుకున్నది.

**రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరీక్షగా పుర పోరు**
తెలంగాణ రాజకీయాల్లో రాబోయే మున్సిపల్ ఎన్నికలు అత్యంత కీలకంగా మారనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తవుతున్న వేళ, రాజకీయ సమీకరణాలు మారుతున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు అధికార కాంగ్రెస్‌కు, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు అసలైన పరీక్షగా నిలవనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ గుర్తుపై జరిగే తొలి పెద్ద ఎన్నికలు కావడంతో ఫలితాలకు రాజకీయంగా భారీ ప్రాధాన్యం ఏర్పడింది.
పంచాయతీ ఎన్నికల్లో స్పష్టమైన ఆధిపత్యం ఏ పార్టీకి దక్కకపోవడం ఈసారి పోరును మరింత ఉత్కంఠగా మారుస్తోంది. పట్టణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ పట్టు కొనసాగుతుందా? లేక కాంగ్రెస్ వైపు ఓటర్లు మొగ్గుచూపుతున్నారా? అన్నది ఈ ఎన్నికల్లో తేలనుంది.

**కేటీఆర్‌కు సవాల్, కవిత పాత్ర కీలకం**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ ఎన్నికలు కీలక పరీక్ష. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, పట్టణ ఓటర్లలో కోల్పోయిన నమ్మకాన్ని తిరిగి పొందడం ఆయన ముందున్న ప్రధాన సవాళ్లు. సోషల్ మీడియా తప్ప గ్రౌండ్ లెవల్‌లో పార్టీ బలం తగ్గిందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.
ఇదే సమయంలో కవిత పాత్ర కీలకంగా మారే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. మహిళా ఓటర్లపై ఆమెకు ఉన్న ప్రభావం, మహిళా భద్రత, ఉపాధి, జీవన వ్యయం వంటి అంశాలను ముందుకు తెచ్చే వ్యూహం బీఆర్ఎస్‌కు కొత్త ఊపునివ్వొచ్చన్న అంచనాలు ఉన్నాయి.

**కాంగ్రెస్, బీజేపీలకు కూడా గట్టి పరీక్ష**
అధికార కాంగ్రెస్‌లో పాత-కొత్త నేతల మధ్య విభేదాలు, టికెట్ల పంపిణీపై అసంతృప్తి పార్టీకి సవాల్‌గా మారుతోంది. మరోవైపు బీజేపీకి ఈ ఎన్నికలు అర్బన్ బలం నిరూపించుకునే అగ్ని పరీక్ష. కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ కార్పొరేషన్లపై కమలం ప్రత్యేక ఫోకస్ పెట్టింది.

**రిజర్వేషన్ల గండం**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీ అన్ని పార్టీలకూ తలనొప్పిగా మారింది. మున్సిపాలిటీల్లో ప్రస్తుతం 32 శాతం మాత్రమే బీసీలకు దక్కడంతో మిగిలిన 10 శాతం పార్టీపరంగా అమలు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో సీట్ల పంపిణీపై మూడు పార్టీల్లోనూ అంతర్గత విభేదాలు తలెత్తుతున్నాయి.
మొత్తంగా చూస్తే, మున్సిపల్ ఎన్నికలు పార్టీల రాజకీయ బలం మాత్రమే కాదు, భవిష్యత్ రాజకీయ దిశను కూడా నిర్ణయించే కీలక ఘట్టంగా మారనున్నాయి.

## 'మెగా'ను కాపాడేందుకు హరీశ్ రావు పాట్లు
## మెగా కృష్ణారెడ్డి కోసమే నైనీ టెండర్లు

- **ఈ వ్యవహారంలో సృజన్ రెడ్డి చిన్న చేప**
- **అవినీతి తిమింగలానికి అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ ఆవేదన**
- **హరీశ్ రావును నమ్మి ఆయన కేటీఆర్ ప్రెస్ మీట్ పెట్టారు**
- **నేను కాంగ్రెస్ లో చేరను**
- **జాగృతి అధ్యక్షురాలు కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
బొగ్గు టెండర్ల వ్యవహారంలో పెద్ద తిమింగలం మెగాను కాపాడేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు పాట్లు పడుతున్నారని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తిమింగలం లాంటి కాంట్రాక్టర్ కు అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ ఆవేదన చెందుతోందన్నారు. మెగా కృష్ణారెడ్డి కోసమే నైనీ టెండర్లు పెట్టారన్న ఆమె ఈ టెండర్ల అంశంలో సృజన్ రెడ్డి కేవలం చిన్న చేపనే అన్నారు. పవర్ మినిస్టర్ భట్టికి లేఖ రాయడానికి బీఆర్ఎస్ కు ఇబ్బంది ఏంటి అని నిలదీశారు. అసలు బీఆర్ఎస్ పాలనలో ఓబీసీలకు సైట్ విజిట్ విధానం లేదని సెటైర్ వేశారు. ఆదివారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. నైని కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రెస్ మీట్ పెట్టగానే మా గుంట నక్క ప్రెస్ మీట్ పెట్టారని హరీశ్ రావును ఉద్దేశించి చెప్పారు. గుంట నక్క ప్రెస్ మీట్ ను గుడ్డిగా నమ్మి కేటీఆర్ ప్రెస్ మీట్ పెట్టారని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో ప్రభుత్వం చేపడుతోన్న విచారణ రెండేళ్లుగా సాగుతూ 'కార్తీకదీపం' సీరియల్‌ను తలపిస్తోందని కవిత చురకలంటించారు. ప్రజల్లో ఇది హాస్యాస్పదంగా మారిందని ఎద్దేవా చేశారు. కేవలం ఎన్నికల లబ్ధి కోసమే ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తీవ్రవాదుల కోసం వాడాల్సిన ట్యాపింగ్‌ను రాజకీయాలకు వాడటం సరికాదని సూచించారు. విచారణను సాగదీయకుండా వెంటనే బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారనీ దానికి తాను వ్యతిరేకమంటూ టీపీసీసీ చీఫ్ చేసిన వ్యాఖ్యలపై కవిత స్పందించారు. ఎట్టిపరిస్థితుల్లోనే తాను కాంగ్రెస్‌లో చేరనని చెప్పారు. అసలు ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు.. మీరే జాగృతి పార్టీలో చేరండని మహేశ్ కుమార్ గౌడ్ కు సూచించారు. భవిష్యత్తులో తాను స్థాపించే పార్టీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు మహేష్ గౌడ్‌కు నా పార్టీలో కీలక పదవి ఇస్తానని వ్యాఖ్యానించారు.

## ప్రపంచ పర్యాటక కేంద్రంగా తెలంగాణ

- **పెట్టుబడుల ఆకర్షణగా తెలంగాణ టూరిజం పాలసీ**
- **సీఎం రేవంత్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
దేశ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప మార్గం పర్యాటకమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఆదివారం జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలపై అవగాహన పెంపొందించడంతో పాటు పర్యాటక రంగం ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టి, ప్రాంతీయ అభివృద్ధి, జాతీయ ప్రతిష్ఠ, ప్రకృతి సంరక్షణకు ఎంతో తోడ్పడుతుందని సీఎం ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో తెలంగాణను అత్యంత ప్రాధాన్యత కలిగిన పర్యాటక గమ్యస్థానంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో తెలంగాణ టూరిజం పాలసీ - 2025-30ను ప్రకటించామని తెలిపారు. ఆధ్యాత్మిక, వారసత్వ, సాంస్కృతిక, సాహస, వైద్య & వెల్నెస్, పర్యావరణ పర్యాటక రంగాల అభివృద్ధి ద్వారా పర్యాటకులను, పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ పాలసీని తీసుకొచ్చామని గుర్తు చేశారు. సురక్షిత పర్యాటకం, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పన, అవకాశాలున్న ప్రాంతాలను ప్రత్యేక పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా తెలంగాణ టూరిజం పాలసీని ఆవిష్కరించామని అన్నారు. ప్రసిద్ధి చెందిన స్మారక చిహ్నాలు, చారిత్రక ప్రదేశాలు, పవిత్ర పుణ్యక్షేత్రాల గత వైభవం నుంచి రాష్ట్ర గుర్తింపును ప్రతిబింబించే ఉత్సవాలు, వంటకాలు, హస్తకళల వరకు తెలంగాణ ప్రత్యేకత స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు.




# టెండర్ ఎందుకు రద్దుచేశారు?

- **సైట్ విజిట్ పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే**
- **దొంగే దొంగా అన్నట్లు ఉంది**
- **మాజీ మంత్రి హరీష్ రావు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తమ ప్రభుత్వ హయాంలో సైట్ విజిట్ అనేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వమే దాన్ని పెట్టిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సింగరేణి స్కాంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుండగా, భట్టి విక్రమార్క స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా మాటల గారడీ చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డే దొంగా అంటుంటే... ఆయనతో మాట్లాడతానని భట్టి వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉందన్నారు. సింగరేణి బొగ్గు గనుల టెండర్లలో భారీ అవినీతి జరిగిందని, ఇందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆయన బావమరిది సృజన్ రెడ్డి ప్రధాన సూత్రధారులని ఆరోపించారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై స్పందించిన హరీష్ రావు.. 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' (దొంగే దొంగ అన్నట్లు) సామెతను గుర్తు చేస్తూ మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అవినీతికి బాధ్యుడైనప్పుడు, మళ్ళీ ఆయనతో మాట్లాడితే ఏం ప్రయోజనం ఉందని ప్రశ్నించారు. సింగరేణి స్కామ్‌కు బాధ్యులు ఎవరు? ఎంత నష్టం జరిగింది? లబ్ధి పొందింది ఎవరు? ఈ 3 కీలక ప్రశ్నల్లో ఒక్కదానికి కూడ భట్టి సమాధానం చెప్పకుండా దాటవేశారు. ముఖ్యమంత్రి, ఆయన బావమరిది బాగోతం బయటపడకుండా తన 40 ఏళ్ల అనుభవంతో కాపాడే ప్రయత్నం భట్టి విక్రమార్క చేస్తున్నారని హరీష్ రావు ఎద్దేవా చేశారు.
తమకు కావాల్సిన కంపెనీలు టెండర్ దక్కించుకోవడానికి 'సైట్ విజిట్ సర్టిఫికెట్' తప్పనిసరి అనే కొత్త నిబంధనను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని హరీష్ రావు ఆరోపించారు. 2018లో సీఎంపీడీఐ సిఫార్సు చేసిందని భట్టి చెబుతున్నప్పటికీ, అది కేవలం వాషింగ్ ప్లాంట్లు వంటి పరిమిత పనులకే వర్తిస్తుందని, ఓబీ (ఓవర్‌బర్డన్) పనులకు కాదని హరీష్ రావు స్పష్టం చేశారు. కేవలం తమ అనుయాయులకు, ముఖ్యంగా సృజన్ రెడ్డికి చెందిన షోడా కన్స్ట్రక్షన్స్‌కు కాంట్రాక్టులు కట్టబెట్టేందుకే ఈ నిబంధనను రింగ్ మాస్టర్ లాగా వాడుకుంటున్నారని ఆరోపించారు. అనేక కంపెనీలు సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసినా, కావాలనే నిరాకరించి బ్యాక్ డేటెడ్‌లో తమ వారికి ఇచ్చారని ఈమెయిల్ ఆధారాలను ప్రస్తావించారు.

**పతనం అవుతున్న ఉత్పత్తి - నిర్వహణ లోపం**
బీఆర్ఎస్ హయాంలో సింగరేణి 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అది 43 మిలియన్ టన్నులకు పడిపోయిందని హరీష్ రావు గణాంకాలను బయటపెట్టారు. అనుభవం లేని కాంట్రాక్టర్లకు పనులు ఇవ్వడం వల్లే ఉత్పత్తి తగ్గిపోయిందని విమర్శించారు. అలాగే, సింగరేణి లాభాలను ఫుట్‌బాల్ సోకులకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారాలకు వాడుకుంటూ కార్మికుల బోనస్‌లో కోత విధిస్తున్నారని మండిపడ్డారు.

**కార్మిక వ్యతిరేక విధానాలు**
వారసత్వ ఉద్యోగాల కోసం గతంలో కేసీఆర్ నెలకు ఒకసారి మెడికల్ బోర్డు నిర్వహిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో కేవలం రెండు సార్లు మాత్రమే నిర్వహించిందని హరీష్ రావు తప్పుబట్టారు. మెడికల్ బోర్డులో అనవసరమైన కొర్రీలు పెడుతూ వారసత్వ ఉద్యోగాలను నిర్వీర్యం చేస్తున్నారని, కార్మికులకు కార్పొరేట్ వైద్యం బంద్ చేసి ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఆయన పలు డిమాండ్లు ప్రభుత్వం ముందు పెట్టారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనతో ఖరారైన ఓబీ వర్క్స్, సోలార్ పవర్ ప్లాంట్స్ టెండర్లన్నింటినీ వెంటనే రద్దు చేయాలని, నిరాకరించిన కంపెనీల వివరాలు, ఈమెయిల్స్, టెండర్ మీటింగ్ మినిట్స్ పై శ్వేతపత్రం విడుదల చేయాలని, ఈ మొత్తం కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐ విచారణ జరిపించాలన్నారు. వారసత్వ ఉద్యోగాల కోసం ప్రతి నెలా మెడికల్ బోర్డులు నిర్వహించాలి, లేదంటే సింగరేణి భవనం ముట్టడిస్తామని హెచ్చరించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
26.01.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





**రెండో ప్రపంచ యుద్ధం (1939–1945)**

ఇతిహాసంలోనే అతిపెద్ద యుద్ధం. నాజీల ఆక్రమణ, హోలోకాస్ట్, అణుబాంబులు ఈ యుద్ధానికి గుర్తింపు. దాదాపు 7 కోట్ల మరణాలు.

# వికసించిన పద్మాలు

- ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు 'నోరి'కి పద్మ భూషణ్
- ఉభయ రాష్ట్రాల్లో 11 మందికి పురస్కారాలు
- తెలంగాణ నుంచి మామిడి రామరెడ్డికి పద్మశ్రీ
- పశుసంవర్ధక, పాడి పరిశ్రమ విభాగాల్లో అందించిన సేవలకు గుర్తింపు
- సినీనటులు మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్ కు వరించిన అవార్డు
- యూజీసీ మాజీ ఛైర్మన్ జగదీశ్ కుమార్‌కు ఢిల్లీ కోటాలో పద్మశ్రీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం 'పద్మ'పురస్కారాలు ప్రకటించింది. ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మ భూషణ్, 113మందికి పద్మశ్రీ అవార్డులను ఆదివారం ప్రకటించింది. వారిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ కు ఎంపికయ్యారు. అలాగే ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి గడ్డమణుగు చంద్రమౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయానంద్ రెడ్డి, పశుసంవర్థక రంగంలో మామిడి రామా రెడ్డి, కళా రంగం నుంచి దీపికా రెడ్డి, మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ లకు పద్మ శ్రీ పురస్కారాలు వరించాయి. యూజీసీ మాజీ ఛైర్మన్ మామిడాల జగదీశ్ కుమార్‌కు ఢిల్లీ కోటాలో పద్మశ్రీ వరించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన 45 మందికి ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డులకు ఎంపిక చేయగా.. వాటిలో ఏపీ, తెలంగాణకు చెందిన 11 మందికి ఈ పురస్కారాలు వరించాయి. తెలంగాణకు చెందిన మామిడి రామరెడ్డికి పద్మశ్రీ అవార్డు వరించింది. పాడి, పశుసంవర్ధక విభాగాల్లో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం ప్రకటించింది. తమిళనాడుకు చెందిన నటేశన్, హైదరాబాద్ లోని సీసీఎంబీలో పని చేస్తున్న డాక్టర్ కుమారస్వామి తంగరాజ్‌కు జన్యుసంబంధ పరిశోధనలకు వారిని పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది. మానవ పరిణామ క్రమం, జన్యుసంబంధ వ్యాధులపై ఆయన పలు పరిశోధనలు చేసి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు.

**పద్మవిభూషణ్**

ధర్మేంద్రకు మరణానంతరం, అచ్యుతానందన్(కేరళ), మరణానంతరం, కె.టి.థామస్(కేరళ), సాహితీవేత్త పి.నారాయణన్(కేరళ), కళల విభాగంలో ఎన్.రాజాం(ఉత్తరప్రదేశ్).

**పద్మభూషణ్**

ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూసోరేన్, క్రీడాకారుడు విజయ్ అమృతరాజ్, ప్రజావ్యవహారాల విభాగంలో వి.కె.మల్హోత్రా, కళల విభాగంలో మమ్ముట్టి(కేరళ), ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు,
గాయని అల్కా యాజ్ఞిక్(మహారాష్ట్ర), మాజీ గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారి(ఉత్తరాఖండ్).

**తెలుగు 'పద్మశ్రీ'లు**

సినీనటుడు మురళీమోహన్, సినీనటుడు రాజేంద్ర ప్రసాద్, ఏపీకి చెందిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్,
ఏపీకి చెందిన వేంపటి కుటుంబశాస్త్రి (సాహిత్యం), తెలంగాణకు చెందిన గూడూరు వెంకట్రావు(వైద్యం),
తెలంగాణకు చెందిన కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్(సైన్స్), తెలంగాణకు చెందిన గడ్డమనుగు చంద్రమౌళి(సైన్స్ విభాగం), తెలంగాణకు చెందిన దీపికారెడ్డి (నృత్యకారిణి), తెలంగాణకు చెందిన పాలకొండ విజయ్‌ఆనంద్‌రెడ్డి(వైద్యం), అంకె గౌడ (సాహిత్యం కర్ణాటక), తంగరాజ్ (హైదరాబాద్ సీసీఎంబీ శాస్త్రవేత్త), ఎస్‌జీ సుశీలమ్మ, సంగ్యుగామ్, షఫీ సాదిక్, శ్రీరంగ్ దేవబాలద్, శ్యామ్ సుందర్, సింహాచల్ పాత్రో, సురేశ్ హనఘవాడి, తాగరామ్ భీల్, తేచి గుబిన్, తిరువయ్యూర్ భక్తవత్సలం, విశ్వ బంధు, యమున్ జాత్ర సింగ్, అర్మిడ ఫెర్నాండెజ్ (మహారాష్ట్ర), భగవాన్‌దాస్ రాయికర్ (మధ్యప్రదేశ్), భిక్ల్యా లదక్య దిండా, బ్రిజ్‌లాల్ భట్ (జమ్ము కశ్మీర్), బుద్రి తాటి, చరణ్ హెబ్రామ్, చిరంజిలాల్‌యాదవ్, ధార్మిక్‌లాల్ చునిలాల్ పాండ్య, గఫ్రుద్దీన్ మెవాటి జోగి, హాలీ వార్, ఇంద్రజిత్ సింగ్, సింధు, కె.పజనీవెల్, కైలాశ్ చంద్ర పంత్, ఖెమ్ రాజ్ సుంద్రియాల్, కొల్లాక్కయిల్ దేవకి అమ్మ జీ, మహేంద్ర కుమార్ మిశ్రా, మిర్ హాజీభాయ్ కసమ్‌భాయ్, మోహన్ నగర్, నరేష్ చంద్ర దేవ్ వర్మ, నీలేష్ వినోద్‌చంద్ర మండేవాలా, నూరుద్దీన్ అహ్మద్, ఒత్తువర్ తిరుత్తణి స్వామి నాథన్, పద్మ గుర్మీత్, పోహిలా లక్పెపి, పుణ్యమూర్తి నటేషణ్, ఆర్. కృష్ణన్, రఘుపత్ సింగ్, రఘువీర్ తుకారామ్ ఖేద్కర్, రాజస్తపతి కలిప్ప గౌండర్, రామకృష్ణారెడ్డి మామిడి, రామచంద్ర గాడ్‌బోలే సునీత గాడ్‌బోలే.

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

పద్మ భూషణ్, పద్మ శ్రీ పురస్కారాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంపికైన వారికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి గడ్డమణుగు చంద్రమౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయానంద్ రెడ్డి, పశుసంవర్ధక రంగంలో మామిడి రామా రెడ్డి, కళా రంగం నుంచి దీపికా రెడ్డి, మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ లకు పద్మ శ్రీ పురస్కారాలు దక్కడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. సేవా, కళా, ఇతర రంగాల్లో వారు చూపిన అంకితభావం, సేవలతోనే ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపికయ్యారని సీఎం పేర్కొన్నారు.

## తెలంగాణ పోలీసులకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి విశిష్ట సేవా పథకాలకు తెలంగాణ పోలీసు ఎంపికయ్యారు. మెడల్ ఫర్ మెరిటేరియస్ సర్వీసెస్ అవార్డుకి 15 మంది పోలీస్ అధికారులు, హోంగార్డ్ విభాగం నుంచి ముగ్గురు, ఫైర్ విభాగం ముగ్గురు నుంచి ఎంపికయ్యారు పోలీస్, ఫైర్, హోమ్ గార్డ్ , సివిల్ డిఫెన్స్ , కరెక్షనల్ సర్వీసెస్ నుంచి అవార్డు గ్రహితలను ఎంపిక చేశారు. మెడల్ ఆఫ్ గ్యాలంటరీ - మర్రి వెంకట రెడ్డి (హెడ్ కానిస్టేబుల్), రాష్ట్రపతి విశిష్ట సేవ పతకం (ప్రెసిడెంట్ మెడల్ ఫర్ డిస్టిన్ గ్వ్యాషుడ్ సర్వీస్), మంద జీఎస్ ప్రకాష్ రావు అడిషినల్ ఎస్పీ, ఎ.దామోదర్ రెడ్డి సబ్ ఇన్స్ పెక్టర్, మెడల్ ఫర్ మెరిటేరియస్ సర్వీసెస్ లో బీ. సుమతి ఐజీ, ఎస్ఐబీ, పి.వెంకట్ రాములు కమాండెంట్, ఎం. శంకర్ డీఎస్పీ, ఎ.భాను మూర్తి సీనియర్ కమాండెంట్, కేవీఎం ప్రసాద్ డీసీపీ, సి వంశీ మోహన్ రెడ్డి డీఎస్పీ, టీ.లక్ష్మి డీఎస్పీ, బీ.ఎల్లయ్య సబ్ ఇన్‌స్పెక్టర్, వి.పురుషోత్తం రెడ్డి సబ్ ఇన్‌స్పెక్టర్, సయ్యద్ అబ్దుల్ కరీం సబ్ ఇన్‌స్పెక్టర్, బి. ఆనందమ్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్, పైలి మనోహర్ హెడ్ కానిస్టేబుల్.



# ఆధారాలతో బయటపెడతా

- కుంభకోణంలో సీఎంను తప్పించేందుకు భట్టి ప్రయత్నాలు
- సైట్ విజిట్ సర్టిఫికెట్ పై భట్టి అవాస్తవాలు
- టెండర్లను పరిశీలించే సీఎంపీడీఐ, మెకాన్, ఆర్ఐపీడీఎస్ కు పక్కనబెట్టారు
- మాజీ మంత్రి హరీశ్ రావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కాంగ్రెస్ పాలనలో సింగరేణి టెండర్లలో జరిగిన కుంభకోణాలన్నీ ఆధారాలతో సహా త్వరలోనే బయటపెడతానని మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. కేవలం నైనీ, సోలార్ స్కామ్‌లే కాదని ఇంకా చాలా కుంభకోణాలకు కాంగ్రెస్ నాయకుల తెరలేపారన్నారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ పై భట్టి అవాస్తవాలు మాట్లాడారన్నారు. ఆ విధానం లోపభూయిష్టం అన్న ఆయన.. ఇది వద్దని సింగరేణికి ఫిర్యాదులు వచ్చింది నిజం కాదా? అని నిలదీశారు. ఈ విషయం మీటింగ్‌లో మాట్లాడారా లేదా బయటపెట్టాలని భట్టికి సవాల్ చేశారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. మినిట్స్ ఆఫ్ ది మీటింగ్స్ బయటపెట్టాలన్నారు. సీఎం బావమరిది ఏ హోటల్ లో కూర్చుని టెండర్లు నిర్ణయించారో మాకు తెలుసని ఆఫోటోలు కూడా సమయం వచ్చినప్పుడు బయటపెడతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని బొగ్గు స్కామ్ నుంచి బయటపడేసేందుకు భట్టి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డే అవినీతి చేస్తున్నారంటే ఆయనతో మాట్లాడటమేంటని ప్రశ్నించారు. టెండర్ల విషయంలో తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా భట్టి దాటవేశారన్నారు. ఈ విషయంలో మసిపూసి మారెడుకాయ చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

**టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేదు**

సింగరేణి టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేదని హరీశ్ రావు ఆరోపించారు. సైట్ విజిట్ నిబంధన బీఆర్ఎస్ హాయంలోనే వచ్చిందని భట్టి అబద్ధం చెప్పారన్నారు. సింగరేణి టెండర్లను సీఎంపీడీఐ, మెకాన్, ఆర్ఐపీడీఎస్ పరిశీలిస్తాయన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తమ వారికి టెండర్లు ఇచ్చుకునేందుకే ఈ సంస్థలను పక్కన పెట్టిందన్నారు. 2018 నుంచే సైట్ విజిట్ నిబంధన ఉందని భట్టి మాట్లాడారనీ కానీ ఓబీ (ఓవర్ బర్డెన్ రిమూవల్) వర్క్స్ కు గతంలో సైట్ విజిట్ విధానమే లేదనే విషయాన్ని గుర్తు చేశారు. నిజాన్ని ఒప్పుకోకుండా ఈ నిందను బీఆర్ఎస్ పైకి నెట్టే ప్రయత్నం భట్టి చేస్తున్నారన్నారని హరీశ్ రావు మండిపడ్డారు. ఓబీ వర్క్స్ లో సైట్ విజిట్ విధానం తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? అని నిలదీశారు. ఈ విషయంలో ఎక్కడైనా మాట్లాడుదామో భట్టి చెప్పాలని సవాల్ చేశారు. 2025 జనవరిలో సైట్ విజిట్ లేకుండానే భూపాలపల్లిలో ఒక ఓబీ కాంట్రాక్ట్ టెండర్ పిలిచారన్నారు. అంటే మీ ప్రభుత్వం తొలినాళ్లలో పాత బీఆర్ఎస్ విధానాన్నే ఇక్కడ అమలు చేశారని చెప్పారు.. ఆ తర్వాత మూడు నెలలకు 2025 మే నెలలో వీ ఆర్‌ఓసీ టెండర్ ను సైట్ విజిట్ తో పిలిచారనీ దీని లబ్ధిదారుడు సృజన్ రెడ్డి శోధా కన్ స్ట్రక్షన్ అని ఆరోపించారు.



# 'ఎర్రబెల్లి'ది నీచబుద్ధి

- అందుకే రేవంత్ పార్టీలో రానివ్వలేదు
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

**ముద్ర, వరంగల్ :**

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయకర్ ది నీచ బుద్ధి అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి ఆయన్ను కాంగ్రెస్ పార్టీలోకి రానివ్వలేదని న్నారు. ఆదివారం వరంగల్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎర్రబెల్లికి సీఎం రేవంత్ రెడ్డిని అనే స్థాయి లేదని దుయ్యబట్టారు. చిన్న మెదడు చితికి ఏం మాట్లాడుతున్నారో కూడా అర్థం కావట్లేదన్నారు. మనవరాలి వయసున్న అమ్మాయి చేతిలో ఎర్రబెల్లి ఓడిపోయారని హోల్ సేల్ గా టీడీపీ ఎమ్మెల్యేలను కేసీఆర్‌కు అమ్మిన చరిత్ర ఆయనదని విమర్శించారు. గజ దొంగ రాజయ్యకు తోడుగా మరో ముగ్గురు స్టువర్టు పురం దొంగలు తోడయ్యారని ఆరోపించారు. 2023లో రాజయ్యకు టికెట్ ఇవ్వొద్దని కేసీఆర్‌కు ఎర్రబెల్లి, పోచంపల్లి, పల్లా రాజేశ్వర్ రెడ్డి చెప్పారని ఆరోపించారు. మున్సిపాలిటీని గెలిపించే పరిస్థితి రాజయ్యకు లేదని కేసీఆర్ కు చెప్పి ముగ్గురు స్టేషన్ ఘన్ పూర్ కు ఇన్ చార్జీలుగా ఉండి రాజయ్యను నాశనం చేసేందుకు కుట్ర చేస్తున్నారని వ్యాఖ్యానించారు.



# పంజాగుట్టలో డ్రగ్స్ కలకలం

- డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఐదుగురు విద్యార్థులు

**ముద్ర, హైదరాబాద్ :**

హైదరాబాద్ పంజాగుట్టలోని ఓ కాలేజీకి చెందిన విద్యార్థులు డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు పట్టుబడ్డారు. నాగార్జున సర్కిల్ పరిధిలో ఐదుగురు విద్యార్థులను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 10 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నాగార్జున సర్కిల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు యువకులను గమనించిన పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.., వారు డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఐదుగురూ ఒకే కాలేజీకి చెందిన విద్యార్థులుగా పోలీసులు నిర్ధారించారు. డ్రగ్స్‌ను ఎక్కడి నుంచి సేకరించారు, ఎవరి ద్వారా సరఫరా జరుగుతోంది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో పంజాగుట్ట ప్రాంతంలో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది. కాలేజీ విద్యార్థుల్లో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు సేకరిస్తున్న పోలీసులు, డ్రగ్ సరఫరా వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను బయటపెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# ఇక శాశ్వత చిరునామా

- సంచార జాతులకు గుర్తింపు
- ఎంబీసీ జాబితాలో మరో 14 కులాలు
- ఇప్పటికే జాబితాలో 36 కులాలు
- త్వరలోనే కేంద్రానికి బీసీ కమిషన్ నివేదిక
- 11 లక్షల మందికి చేకూరనున్న 'సీడ్' లబ్ది
- రాష్ట్ర సర్కార్ నిర్ణయం




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఏళ్ల నుంచి ఆదరణకు నోచుకోని సంచార జాతులకు గుర్తింపు ఇవ్వాలని తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో సంచార జాతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సర్టిఫికెట్లు లేక పడుతున్న ఇబ్బందులను గుర్తించి వారికి గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన తరగతుల (ఎంబీసీ) జాబితాను విస్తరించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రస్తుతం ఉన్న జాబితాకు అదనంగా మరో 14 కులాలను చేర్చి.. ఆ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు రంగం సిద్ధం చేసింది. దీంతో రాష్ట్రంలో సంచార జాతుల సంఖ్య 50కి చేరనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో వేలాది కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ ఫలాలు అందనున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే ప్రకారం రాష్ట్రంలో ఎంబీసీల జనాభా సుమారు 11 లక్షలకు పైగా ఉన్నది. ఇందులో వడ్డెర, బోయ కులాల జనాభా సగం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ.. మిగిలిన చిన్న కులాల వారు తీవ్రమైన పేదరికంలో మగ్గుతున్నారు. సంచార జీవనం గడిపే ఈ జాతులకు శాశ్వత చిరునామా లేకపోవడంతో వారికి ప్రభుత్వ పథకాలు అందడం లేదు. తాజాగా కేంద్రానికి పంపనున్న జాబితా ద్వారా వీరందరికీ డీడబ్ల్యూబీడీఎన్ సీ బోర్డు ద్వారా ప్రత్యేక గుర్తింపు లభించనుంది. దీనివల్ల అట్టడుగున ఉన్న ఈ 14 కులాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అధికారులు భావిస్తున్నారు.

**ఎంబీసీ జాబితాలో చేరనున్న కొత్త కులాలు..**

రాష్ట్ర బీసీ కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ 14 కులాలను గుర్తించింది. దాసరి (బెగ్గరి), జంగం, పంబాల, వాల్మీకి బోయ, తల్యారీ, చుండువాళ్లు, యాట, కునపులి, రాజానాల, బుక్క అయ్యావార్స్, సిద్దుల, సిక్లిగర్, ఫకీర్, గుడ్డి ఏలుగు వాళ్లు. ప్రస్తుతం ఎంబీసీ జాబితాలో 36 కులాలు ఉండగా.. తాజా మార్పులతో ఈ సంఖ్య 50కి పెరుగుతుంది. ఈ కులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన బీసీ కమిషన్.. వీరిని ఎంబీసీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వానికి నివేదించింది. ఎంబీసీ జాబితాలో చేరిన కులాలకు కేంద్ర ప్రభుత్వం డీనోటిఫైడ్ ట్రైబల్ సర్టిఫికెట్లను జారీ చేస్తుంది. దీంతో కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న 'స్కీమ్ ఫర్ ఎకనామిక్ ఎంపవర్మెంట్ ఆఫ్ డీఎన్టీస్' పథకం కింద పలు ప్రయోజనాలు లభిస్తాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత కోచింగ్.. కుటుంబ సభ్యులందరికీ మెరుగైన వైద్య సదుపాయాలు.. సొంత ఇంటి కల నెరవేర్చుకోవడానికి ఆర్థిక సాయం.. స్వయం ఉపాధి కోసం తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తారు.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

Hot Topic

# జీడీపీ టాప్-5లో హైదరాబాద్ ఎందుకు లేదు?

హైదరాబాద్ అనగానే మనకు ఐటీ కారిడార్‌లు, భారీ ఫార్మా కంపెనీలు, ఆకాశాన్నంటే రియల్ ఎస్టేట్ గుర్తుకువస్తాయి. దక్షిణ భారత దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి అనడంలో సందేహం లేదు. అయితే, దేశంలోని అత్యధిక జీడీపీ కలిగిన మొదటి ఐదు నగరాల జాబితా తీస్తే మాత్రం ముంబై, ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా, చెన్నై వంటి నగరాలు కనిపిస్తాయి కానీ, హైదరాబాద్ పేరు ఉండదు. ఎంతో పురోగతి ఉన్నా ఈ 'నెంబర్ గేమ్'లో భాగ్యనగరం ఎందుకు వెనుకబడిందో విశ్లేషిస్తే ఆసక్తికరమైన అంశాలు కనిపిస్తాయి.

ముంబైని దేశ ఆర్థిక రాజధానిగా పిలుస్తాం. అక్కడ బ్యాంకింగ్, ఫైనాన్స్, వినోదం (బాలీవుడ్), తయారీ మరియు పోర్ట్ వాణిజ్యం వంటి విభిన్న రంగాలు ఉన్నాయి. ఢిల్లీలో వాణిజ్యంతో పాటు పరిపాలన మరియు పారిశ్రామిక రంగాలు బలంగా ఉన్నాయి.మన నగరం ప్రధానంగా సేవా రంగం , ముఖ్యంగా ఐటీ మరియు ఫార్మాపైనే ఎక్కువగా ఆధారపడింది. ఇవి భారీ స్థాయిలో ఉద్యోగాలను కల్పిస్తున్నప్పటికీ, నగరం యొక్క మొత్తం ఆర్థిక పరిమాణం ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే తక్కువగా కనిపిస్తోంది.జీడీపీని లెక్కించేటప్పుడు అనుసరించే విధానం కూడా హైదరాబాద్‌కు ప్రతికూలంగా మారుతోంది. ఢిల్లీ జీడీపీ అంటే కేవలం ఢిల్లీ నగరం మాత్రమే కాదు, గురుగ్రామ్, నోయిడా వంటి పరిసర ప్రాంతాల ఆర్థిక కార్యకలాపాలను కూడా కలిపి లెక్కిస్తారు. ఇక్కడ కేవలం జీహెచ్ఎంసీ పరిమితుల్లో ఉన్న ఆదాయాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఒకవేళ హైదరాబాద్ చుట్టూ ఉన్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పారిశ్రామిక ప్రాంతాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ చిత్రం మారుతుంది.

ఒక నగరం ఆర్థికంగా తిరుగులేని శక్తిగా ఎదగాలంటే తయారీ రంగం వెన్నెముకగా ఉండాలి. చెన్నై 'డెట్రాయిట్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచి ఆటోమొబైల్ రంగంలో దూసుకుపోతోంది. కోల్‌కతా మరియు ముంబై వంటి నగరాలకు సముద్ర తీరం ఉండటం వల్ల అంతర్జాతీయ ఎగుమతులు, దిగుమతులు సులభంగా జరుగుతాయి. హైదరాబాద్ భూపరివేష్టిత నగరం కావడం వల్ల భారీ తయారీ పరిశ్రమలు ఇక్కడ కేంద్రీకృతమవ్వడానికి భౌగోళిక పరిమితులు ఉన్నాయి.

అయితే ఇది నిరాశ చెందాల్సిన విషయం కాదు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ తన ఆర్థిక రూపురేఖలను మార్చుకోబోతోంది. కేవలం సాఫ్ట్‌వేర్ సేవలకే పరిమితం కాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు సెమీకండక్టర్ డిజైనింగ్ వంటి హై-టెక్ రంగాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. నగర శివార్లలో డిఫెన్స్, ఏరోస్పేస్ మరియు ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు పూర్తయితే తయారీ రంగం వాటా పెరుగుతుంది. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ చుట్టూ ఉన్న ఉప-నగరాలు ఆర్థికంగా బలపడతాయి.

ర్యాంకులు అనేవి కేవలం అంకెలే. జీవన ప్రమాణాలు, మౌలిక వసతులు మరియు ఉపాధి అవకాశాల పరంగా హైదరాబాద్ ఇప్పటికే అగ్రస్థానంలో ఉంది. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న 'ఫ్యూచర్ సిటీ' మరియు పారిశ్రామిక విస్తరణ సాకారమైతే, మరో దశాబ్ద కాలంలో దేశంలోనే అత్యధిక జీడీపీ కలిగిన టాప్-3 నగరాల్లో భాగ్యనగరం నిలవడం ఖాయం.

- నరేష్,
అసిస్టెంట్ ఎడిటర్, ముద్ర




మచాడో, ట్రంప్ పనికి ప్రజలు ఏమనుకొంటున్నారు?

# ట్రంప్ కోరిక తీరనిదే!

డాక్టర్ కొండి సుధాకర్ రెడ్డి
రిటైర్డ్ సీనియర్ లెక్చరర్,
8985037713

నార్వే రాజధాని ఓస్లో యూనివర్సిటీ రాజనీతి ప్రొఫెసర్ జేన్ హాలండ్ మాట్లారీ నోబెల్ కమిటీకి వెంటనే 2025 నోబెల్ పీస్ ప్రైజ్ విజేత మచాడో నోబెల్ ప్రైజ్ కు అనర్హురాలు గ ప్రకటించాలని ప్రతిపాదించాడు. అంటే కాకుండా ఆమె మానవాళి శాంతి కొరకు గని కనీసం వెనుజులే దేశ ప్రజల ప్రజాస్వామ్యం కొరకు కూడా పోరాడని, ప్రజలమధ్య ఉండకుండా ఎక్కడో దాచుకొని అధికారంకొరకు ట్రంప్ తో లాలుచీపడిన వ్యక్తి నోబెల్ ప్రైజెకు అనర్హురాలని ఘాటుగా లేక రాసాడు. ఇంతకూ ట్రంప్ ను ప్రసన్నం చేసుకొని త్వరలో వెనుజులలో జరిగే ఎన్నికల్లో అమెరికా సహాయంతో ప్రెసిడెంట్ పీఠ మెక్కటానికే తన నోబెల్ ప్రైజ్ ను ట్రంప్ కి బహుమతి గ ఇచ్చిందని, ట్రంప్ ఆ బహుమతిని తన దగ్గర వుంచు కున్నంత మాత్రనా ప్రపంచంలో ఎవ్వరు ఆయనకు నోబెల్ ప్రైజ్ గ్రహీతగా భావించరు. ఈ ఎపిసోడ్ లో మచాడో, ట్రంప్ కక్కుర్తి ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది.

ట్రంప్ తన జీవితకాల నోబెల్ ప్రైజ్ కోరిక తీరిందా?ట్రంప్ బహిరంగంగా తాను ప్రపంచంలోని ఏడు యుద్ధాలను అపాన ని, తనకంటే ప్రపంచంలో శాంతి కాము కులు మరెవరు లేరని, తానొక్కడు మాత్ర మే నోబెల్ శాంతి బహుమతికి అర్హుడనని బహిరంగంగా ఎంత ప్రచారం చేసుకొన్నా నార్వే దేశంలోని నోబెల్ కమిటీ, నోబెల్ ఇన్స్టిట్యూట్ ను ప్రచ్ఛన్నంగా ఎంత ప్రభావితం చేయాలనీ చూసినా, నోబెల్ కమిటీ 2025 ,అక్టోబర్ లో వెనుజువెలా ప్రతి ప్రక్ష నేత మచాడో కు ప్రదానం చేయటం జరిగింది.ఈమె పూర్తీ పేరు మరియా కోరింగ్ మచాడో. ఈమె గత ఏడాదిగా అజ్ఞాతంలో వుంటూ ఆ దేశ ప్రెసిడెంట్ నికోలా మదురో వల్ల ప్రాణ హాని వుండింది. మచాడో సీక్రెట్ గ గత డిసెంబర్ లో నార్వే కు వెళ్లి నోబెల్ బహుమతి స్వీకరించింది.

## నోబెల్ బహుమతి ప్రత్యేకత ఏమిటి?

స్వీడన్ కు చెందిన ఆల్ఫ్రెడ్ నోబెల్ ప్రఖ్యాత కెమిస్ట్రీ ఇంజినీరింగ్ లలో పరిశోధనలు చేసి అనేక ఇన్వెన్షన్లను కనుగొన్నారు .ముఖ్యంగా డైనమైట్ ను కనుగొన్నాడు,అంతేకాదు వ్యాపవేతకూడా ,ఈయన 24 ఏళ్ళ వయసులోనే మొదటి పేటెంట్ను పొందాడు.ఆలా మొత్తం తన జీవిత కాలం లో 355 పేటెంట్ల ను పొందాడు.రక్షణ రంగంలో బోఫోర్స్ యుద్ధవిమానాల పరిశ్రమ కూడా నోబెల్ అభివృద్ధి చేసిన సంస్థ .ఇది మొదట్లో ఐరన్ ,స్టీల్ వ్యాపారరంగంలో ఉండేది. ఆరకంగా ఆల్ఫ్రెడ్ నోబెల్ రాబడి ఇబ్బడి ముబ్బడిగా ఉండటం తో 1895 లో అయన రాసిన వీలునామా ప్రకారం ప్రపంచంలో మానవాళికి ఉపయోగపడే గొప్ప పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలకు ఆ ఏడు నోబెల్ బహుమతులు ఇవ్వాలని పేర్కొన్నాడు.1986 లో ఈయన చనిపోయాడు. ,ఫిజిక్స్,కెమిస్ట్రీ,మెడిసిన్,సాహిత్యం ,ప్రపంచ శాంతి విషయాల్లో విశేష కృషిచేసిన వారిని నోబెల్ కమిటీ గుర్తించి ప్రతి ఏడు అవార్డులు ఇవ్వాలని నిర్దేశించదురు.1969 లో ఆర్థిక శాస్త్రం లోకూడా నోబెల్ బహుమతి ప్రకటించటం జరిగింది.

## నోబెల్ బహుమతికి వున్న విలువ ఏమిటి

ప్రపంచంలోని అతున్నత ప్రైజ్ నోబెల్ ప్రైజ్ మాత్రమే .ఈ ప్రైజ్ ను పొందినవారు ఆయా రంగాలలో నిష్ణాతులుగా ప్రపంచం గుర్తిస్తుంది. ఈ ప్రైజ్ కొరకు అనేకులు తహ తహ తహలాడుతుంటారు. అంటే దీనికున్న ప్రిస్టేజిని మనం మాటల్లో చెప్పలేము.అంతేకాదు ప్రైజెకు వున్న విలువతో పాటు, 200 గ్రాముల మేలిమి బంగారంతో చేసి మెడల్, ఒక మిలియన్ అమెరికన్ డాలర్ల ప్రైజ్ మనీ ఉంటుంది. మెడలపైనా ఆల్ఫ్రెడ్ నోబెల్ చిత్రం ,దాని క్రింద గ్రహీత పేరు ఇంగ్రేవ్ చేయబడుతుంది.ప్రస్తుతం 23 కారెట్స్ నుండి 18 క్యారెట్స్ కు తగించబడింది.1901 లో మొట్టమొదటి నోబెల్ ప్రైజెను ప్రకటించటం జరిగింది.

గతేడాది నోబెల్ శాంతి బహుమతికి ఎంపికయినా మచాడోను ఎంపిక చేయటానికి కారణం వివరిస్తూ నోబెల్ పీస్ కమిటీ ఈ విదంగా పేర్కొంది."ఏ విమెన్ హూ ది ఫ్లేమ్ అఫ్ డెమోక్రసీ బర్నింగ్ అమీడ్ ఏ గులౌన్ డర్క్నెస్స్ "అంటే వెలిగే ప్రజాస్వామ్య దివిటీని చీకటిలో ఆరిపోకుండా నిలిపింది అని ప్రస్తుతుంచింది. మచాడో నోబెల్ బహుమతి స్వీకరిస్తూ ఆ బహుమతి భాదితులైన వెనుజుల ప్రజలకు అంకితమని చెప్పింది ,అలాగే తమ న్యాయబద్ద పోరాటానికి మద్దతు ఇస్తున్న ట్రంప్ కు కూడా అంకిత మంది.. వైట్ హౌస్ వెంటనే బహుమతి మచాడోకు ప్రకటించగానే నోబెల్ కమిటీని నిందిస్తూ నోబెల్ కమిటీ అసలైన శాంతికాముకుడు ను కాదని రాజకీయానికి ప్రాధాన్యత ఇచ్చారని ప్రకటన విడుదల చేసింది.

మచాడోకి ట్రంప్ ఎందుకు ఇచ్చింది?

మచాడో వెనుజుల ప్రతిపక్ష పార్టీకి నాయకురాలు.ఈ నెల మూడున అమెరికా సైన్యం ఆ దేశ ప్రెసిడెంట్ మదురో , అయన భర్య ను మధ్య రాత్రి బందించి అమెరికాకు తీసుకెళ్లాక అమెరికా మచాడోను ప్రెసి డెంట్ గ చేయకుండా అధికార పార్టీకి చెందిన వైస్ ప్రెసిడెంట్ డెల్సిరో డ్రిక్స్ ను చే యటం మచాడోకు ఆశాభంగం కలిగిం ది. అంతే కాకుం డా మచాడోకు ప్రెసిడెంట్ గా చేసేందు కు సరిఅయిన మద్దతు ఆ దేశ ప్రజల్లో ఆమెకు లేదని కుండబ్రద్దలు కొట్టింది. ఈ చర్యతో మచాడో తనపై ట్రంప్ తాను నోబెల్ ప్రైజ్ తీసుకోవటంతో కోపంగా ఉన్నట్టు గ్రహించి ఆయన్ను ప్రస న్నం చేసుకోవటానికి, కనీసం నోబెల్ మెమెంటో, సెర్టిఫికెట్ ను ట్రం ప్ కు ఇచివేస్తే కనీసం అయన తానే నోబెల్ గ్రహీతననే భావనతో ఉంటాడ ని ,ఇట్లనైనా అయన కోరిక తీరినట్లవుతుందని భావించి ఆవిడ తన బహుమతిని త్యాగంచేసినట్టుగాగా పరిశీలకులు భావిస్తున్నారు.

## మరి నోబెల్ కమిటీ ఏమి చెబుతుంది?

నోబెల్ కమిటీ మరియు నోబెల్ ఇన్స్టిట్యూట్ ఇలా ప్రకటించింది.ఒకసారి నోబెల్ బహుమతి ప్రకటించాక ,దానిని మార్చటం వేరొకిరికి ఇవ్వటం,ఇంకొకరి పేరు చేర్చటం కుదరదని ,ఒకసారి నోబెల్ కమిటీ నిర్ణయం ప్రకటించాక ఆ నిర్ణయాన్ని మార్చటం జరగదని తేల్చి చెప్పింది.అంటే కాకుండా నోబెల్ ప్రైజ్ గ్రహీత ప్రైజ్ ను వేరేవారికి ఇచ్చినంత మాత్రాన స్వీకరించనవారి పేరు నోబెల్ గ్రహీతలుగా కమిటీ గుర్తించాడని సోషల్ మీడియాలో ఇటీవల ప్రకటించింది.

గతంలో నోబెల్ తిరస్కరించినవారెవరు..?

అవును గతంలో నోబెల్ ప్రైజెను వద్దన్నవారు వున్నారు. అయినంత మాత్రాన వేరే వారి పేరును కమిటీ ప్రకటించటం చేయలేదు. ప్రఖ్యాత రచయిత జీన్ పాల్ కు 1964 లో సాహిత్యం లో నోబెల్ ప్రైజ్ ప్రకటించారు.రచనలో తాను స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని బహుమతి స్వీకరణతో కోల్పోదలచుకోలేదని.తన రచనలను ఇంస్టిట్యూటలైజ్ చేయదల్చుకోలేదని బహుమతిని తిరస్కరించాడు.అలాగే వియత్నాం రాజకీయవేత్త లీ ద్యూక్ తో 1973 లో శాంతి బహుమతిని కిసింజర్ తో కలిపి ఇస్తే తిరస్కరించాడు. అయితే ఈ రెండు సందర్భాల్లో వీరి స్థానంలో మరెవ్వరికీ కూడా ఆ ఏడాది సాహిత్యం లో గని,ప్రపంచ శాంతి లోగాని వేరెవ్వరికి నోబెల్ ప్రైజ్ లు ఇవ్వలేదు.

నోబెల్ అమ్ముకున్న సందర్భాలుకూడా వున్నాయి. 2019 లో లేట్ మాథెమటిషన్ జాన్ ఎఫ్ నాష్ జూనియర్ కి చెందిన ఎస్టేట్ వారు ఆయనకు 1994 లో ఆర్థిక శాస్త్రంలో వోచిన నోబెల్ ప్రైజ్ ను వేలం ఏయగా $735 ,000 వచ్చిన డబ్బును అయన ప్రతిపాదించిన గేమ్ థియరీ పరిశోదనుకు కేటాయించటం జరిగింది.ఇటీవల కాలంలో రష్యన్ జర్నలిస్ట్ డొమిత్రీ మురతోవ్ తనకు వచ్చిన నోబెల్ ప్రైజ్ ను న్యూ యార్క్ లో వేలం వేయగా $107 మిలియన్ల డబ్బును ఉక్రెయిన్ లో యునైటెడ్ నేషన్స్ చేపట్టిన మానవతా కార్యక్రమాలకు కేటాయించటం జరిగింది.





# ఆరోగ్యం, విద్య ప్రగతి పునాది

## వనపర్తి జిల్లా పాలనపై పట్టు బిగిస్తున్న కలెక్టర్

మధు గౌడ్
జర్నలిస్ట్, వనపర్తి

వనపర్తి జిల్లా పాలనపై కలెక్టర్ పట్టుబిగిస్తున్నారు. విద్య వైద్యం సమాజ ప్రగతికి పునాదిగా భావించి వినూత్న కార్యక్రమలతో తెలంగాణ రాష్ట్రంలోనే వనపర్తి జిల్లాకి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తున్నారు. వైద్యంలో కలెక్ట ర్ అమలు చేస్తున్న పలు కార్యక్రమలతో అవార్డులు జిల్లాకు దక్కినవి. సమాజ పురోగతికి ప్రతిబంధకాలు గా ఉన్నా బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ డ్రగ్స్ పైన అయన ఉక్కుపాదం మోపారు.. అవినీతికి పా ల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించం. కలెక్టర్‌గా బా ధ్యతలు చేపట్టి ఏడాదిన్నర కాలములో జరిగిన జిల్లా అభివృద్ధి పై ముద్ర ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంట ర్వ్యూలో కలెక్టర్ ఆదర్శ సురభి కార్యక్రమాలను వివరించారు.

**వైద్య రంగంలో జిల్లాలో జరుగుతున్నా కార్యక్రమాలు, ప్రజల నుండి వస్తున్న ప్రశంశలను వివరించండి?**

కలెక్టర్: పేదలకు ప్రధానంగా కావాల్సిన సౌకర్యాలలో వైద్యం ముఖ్యమైనదిగా భావించి అనేక కార్యక్రమాలు చేయడం జరిగింది, వైద్య విభాగంలో డాక్టర్ లు సిబ్బంది సమయానికి విధులకు రావడం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది ఫలితంగా ప్రతి నిత్యం ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చే పేదల సంఖ్య గణనీయ స్థాయికి చేరింది.మాత శిశు ఆరోగ్య కేంద్రంలో ఒక్క నెలలో సుమారు 500 మందికి ప్రసవాలను చేయడం రికార్డు... దేశంలోనే టీబీ అత్యధికముగా ఉన్న వంద జిల్లాలో వనపర్తి జిల్లా ను ఒకటిగా గుర్తించారని నేషనల్ టీబి ఎలిమినేషన్ ప్రోగామ్ ద్వారా 580 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించి టీబి నిర్మూలన చర్యలు చేపట్టడం జరిగిందని వంద రోజుల్లోనే 25000 మందికి ఎక్స్రే లను తీయడం రాష్ట్రంలోని అత్యధికంగా చెప్పవచ్చు. దీనిపై అవార్డు కూడా అందుకోవడం జరిగింది. అంతేకాకుండా ప్రజల ఆరోగ్యాన్ని, అవయవాలను దెబ్బతీస్తున్న మహమ్మారి చక్కెర వ్యాధి గ్రస్తులను గుర్తించడం కోసం 2024 అక్టోబర్ రెండో తేదీ నుంచి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకోవడం జరిగింది. జిల్లాలో మొత్తం7 లక్షల మంది జనాభా ఉండగా అందులో 3,25,000 మందికి పరీక్షలు నిర్వహించామని, 19,644 మంది డయాబెటిక్ పేషెంట్స్ ఉన్నట్లు గుర్తించాము. అందులో దాదాపు 3,000 మంది మొదటిసారి ఈ వ్యాధి గుర్రైనట్లు తేలింది. ఆ నియంత్రిత మధుమేహంతో కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉన్నందున ముందస్తు నేత్ర పరీక్షలు నిర్వహించడం కోసం రెటినోపతి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని అందులో డయాబెటిక్ రెటినోపతి, క్యాటరాక్ట్, ఏఎండి బారిన పడిన వారిని గుర్తించి ప్రత్యేక వైద్య చికిత్సల కోసం వైద్యశాలలకు తరలించడం జరుగుతుంది. వనపర్తి జిల్లాలో ప్రత్యేకమైన వనపర్తి హెల్త్ యాప్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అందులో మధుమేహం వ్యాధిగ్రస్తుల పేర్లు వారి పూర్తి వివరాలను డివైస్ లో పొందుపరిచారన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా నిర్వహించే ఈ పరీక్షలతో రెటినోపతి గ్లైకోమా వంటి వాటిని గుర్తించడం జరుగుతుంది. చాలామందికి శుక్లాల సమస్యకు ఉన్నట్లు కూడా తేలింది. వారిని ఆపరేషన్ కోసం వైద్యశాలకు తరలిస్తున్నాం.

**విద్యాభివృద్ధికై తీసుకుంటున్నటువంటి ప్రధానమైన కార్యక్రమాల తో ఫలితాలు ఎలా ఉన్నాయి?**

కలెక్టర్: వనపర్తి జిల్లాలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసే చర్యల్లో భాగంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా దృష్టి కేంద్రీకరించాము. పాఠశాలలను సందర్శించడం, విద్యార్థులు ఏ సబ్జెక్టులో ఎలా ఉన్నారో పరిశీలించాము. మ్యాథమెటిక్స్ లో కొంత వెనుకబడినట్లు తమ దృష్టికి రావడంతో ప్రత్యేకమైన తరగతులను ఆయా విద్యార్థుల కోసం ఏర్పాటు చేయించాము. అదేవిధంగా కట్టెల పొయ్యిలతో ఇబ్బంది పడుతున్నారని తమ దృష్టికి రావడంతో పాఠశాలకు 545 గ్యాస్ కనెక్షన్లు ఇప్పించాము. పదవ తరగతి ఫలితాలు మెరుగ్గా సాధించేందుకు విద్యార్థులను తీర్చిదిద్దేల ఉపాధ్యాయులను ఆదేశించడం జరిగిం ది. కింది తరగతి నుంచి లెక్కల్లో ఫౌండేషన్ మాథ్స్ పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. లెక్కల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం అదనంగా ఒక గంట పాఠశాలలో తరగతులు నిర్వహించేలా ఆదేశించాము. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేందు కు సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. వనపర్తి జిల్లాకు కేంద్ర విద్యాలయం మంజూరు కావడంతో 5వ తరగతి నుంచి పాఠశాల ప్రారంభమైంది. అంగన్వాడి పాఠశాలల్లో చాలామంది పిల్లలు బలహీనంగా ఉన్నట్టు తమ దృష్టికి రావడంతో వారందరినీ గుర్తించాము. 0- 6 ఏళ్ల మధ్య ఉన్న 494 మంది పిల్లలు బలహీన బలహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి ప్రత్యేకమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నాము.

**దివ్యాంగులలో ఆత్మస్థైర్యం నింపే కార్యక్రమాలు ఏమైనా ఉన్నాయా?**

దివ్యాంగులలో ఆత్మస్థైర్యం పెంచేందుకు ప్రధానంగా కొన్ని చర్యలు తీసుకున్నాము. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేకమైన ప్రజావాణి నిర్వహించగా మంచి స్పందన వ్యక్తం అయింది. దాదాపు 150 మంది ప్రజావాణి కి హాజరై ఇల్లు కావాలని ప్రత్యేక భవనం కావాలని పెన్షన్ కావాలని తదితర సమస్యలతో దరఖాస్తులు సమర్పించారు. ఈ మేరకు వారికి భూమి కూడా కేటాయించడం జరిగింది. మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.




**అవినీతిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు వివరించండి?**

అవినీతికి ఎవరు పాల్పడిన ఉపేక్షించము. కఠినంగా వ్యవహరిస్తాము. ప్రజలను ఇబ్బందికి గురి చేస్తూ అవినీతికి పాల్పడినట్లు తన దృష్టికి వస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని, ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలతో పాటు అవగాహన పెంపొందిస్తున్నాము. వచ్చే జీతంతో సంతృప్తిగా జీవించడం తోపాటు మంచి సేవలు అందించి ప్రజల మన్ననలు పొందితే అంతకన్నా వచ్చే ధనం ఏముంటుంది అని ఉద్యోగులకు వివరిస్తున్నాము.



బాల్య వివాహాలపై తీసుకుంటున్న చర్యలు

బాల్య వివాహాలను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరిస్తున్నాం. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కూడా చర్య లు చేపట్టాం. బాల్యవివాహాలకు సహకరించిన తల్లిదండ్రులు, అందుకు సహకరించిన పూజారులు ఫోటోగ్రాఫర్లు హాజరైన ప్రతి ఒక్క రిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. దీని దృష్టిలో ఉంచుకొని బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం అందితే 1098కు సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోపికంగా ఉ ంచుతాము.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.01.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






అమెరికన్ సివిల్ వార్ (1861–1865)
బానిస వ్యవస్థపై పోరాటంగా మొదలైన ఈ యుద్ధంలో అమెరికా అంతర్గతంగా చీలిపోయింది. సుమారు 6 లక్షల మంది మృతి.

# నారాయణపేట జిల్లాను తొలగించే ప్రయత్నాలు సహించం

- **బీజేపీని గెలిపిస్తే మున్సిపాలిటీ అభివృద్ధికి వేల కోట్ల నిధులు**
- **ఎంపీ డీకే అరుణ**

**ముద్ర, నారాయణపేట ప్రతినిధి :**




జిల్లాల పునర్వ్యవస్థీకరణ పేరుతో నారాయణపేట జిల్లా తొలగిస్తారనే ప్రచారం జరుగుతోందని, అలాంటి ప్రయత్నాలు జరిగితే ఊరుకునేది లేదని పాలమూరు ఎంపీ డీకే అరుణ హెచ్చరించారు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నారాయణపేట జిల్లా కేంద్రం తరలిపోకుండా పోరాటం చేసే శక్తి బీజేపీకే ఉందని అన్నారు. జిల్లాలో బీజేపీకి మంచి ఆదరణ ఉందని, ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు.

**పేట అభివృద్ధికి బీజేపీతోనే నిధులు..**
నారాయణపేట అభివృద్ధి కోసం కేంద్ర నిధులు తీసుకురావడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అయితే స్థానిక నిధుల కోసం ఎమ్మెల్యే ప్రపోజల్స్ ఇవ్వడం లేదని విమర్శించారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల తదితర ప్రాంతాల ఎమ్మెల్యేలు ముందుకు రావడంతో అక్కడ వేల కోట్ల రూపాయల కేంద్ర నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నారాయణపేట మున్సిపాలిటీలో బీజేపీని గెలిపిస్తే అభివృద్ధికి వేల కోట్ల నిధులు తీసుకువస్తామని అన్నారు. అవినీతి అంతం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ హామీలు మాటలకే పరిమితమయ్యాయని వ్యాఖ్యానించారు.

**మహిళలకు ఉచిత బస్సు పేరుతో పురుషులకు డబుల్ ఛార్జీలు..**
మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇస్తూ, పురుషులపై డబుల్ చార్జీలు విధిస్తున్నారని ఆరోపించారు. గతంలో బిఆర్ఎస్ స్టేడియానికి రూ.10కోట్లు ప్రకటించి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు మళ్లీ రూ.30 కోట్లు ఇస్తామని చెబితే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ఆత్మకూరులో అమృత్ పథకం కింద మంజూరైన పనులకు రాత్రికి రాత్రే శిలాఫలకాలు వేసి, ఉదయాన్నే శంకుస్థాపనలు చేయడంపై అనుమానం వ్యక్తం చేశారు. ఎంపీగా తనకు కనీస ప్రోటోకాల్ పాటించకుండా సమాచారాన్ని ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కేంద్రం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వ నిధులుగా చెప్పడం సరికాదని విమర్శించారు.



# కాప్రా అభివృద్ధికి కృషి చేస్తా

- **ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**ముద్ర, కాప్రా :**

కాప్రా డివిజన్ పరిధిలోని సాయిపురి కాలనీలో సాయిపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ టెర్రస్ హాల్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధిలో కమ్యూనిటీ హాళ్లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఇటువంటి సౌకర్యాలు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని అన్నారు. కాప్రా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్, మహేష్, ఇంద్రయ్య, సాయిపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకల నేపథ్యంలో సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

**ముద్ర, మల్కాజిగిరి :**

సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఈనెల 26న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. టివోలీ ఎక్స్‌రోడ్ నుంచి ప్లాజా చౌరస్తా వరకు ఉన్న రహదారిని పూర్తిగా మూసివేయనున్నట్లు వెల్లడించారు. సంగీత్ చౌరస్తా, వైఎంసీఏ, ప్యాట్నీ, ప్లాజా, సిటీ ఓ, స్వీకార్ ఉపకార్, సికింద్రాబాద్ క్లబ్, తాడ్‌బండ్, ప్యారడైజ్ చౌరస్తా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమయంలో ఎస్పీ రోడ్, ఎంజీ రోడ్, ఆర్పీ రోడ్, ఎస్డీ రోడ్ మార్గాలను వీలైనంతవరకు తప్పించుకోవాలని సూచించారు. ప్రయాణికులు రైల్వే, బస్ స్టేషన్లకు ముందుగానే బయలుదేరాలని, మెట్రో సేవలను వినియోగించుకోవాలని కోరారు. జేబీఎస్ బోయినపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 871266299 నంబర్‌లో పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# యువ ఓటర్లు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించాలి



- **కలెక్టర్ సి.నారాయణరెడ్డి**

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా :**



16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని యువ ఓటర్లు ప్రతి ఎన్నికల్లో బాధ్యతగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారతదేశంలో విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ మనమందరం భారతీయులమని తెలిపారు. 1950 జనవరి 25న భారత రాజ్యాంగంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఓటు హక్కు వయసును తరువాత 18 సంవత్సరాలకు సవరించారని, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధాన పాత్ర పోషిస్తుందని అన్నారు. కాబట్టి పౌరులందరూ సమాజానికి మేలు చేసే ప్రతినిధులను ఎన్నుకోవడానికి తమ ఓటు హక్కును తప్పక వినియోగించాలని సూచించారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ముఖ్యంగా యువత ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడులకు లోనుకాకుండా నిర్భయంగా ఓటు వేయాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజనలైన సి.కృష్ణారెడ్డి, చౌదరి, మధుసూదన్ రావు, ఎం.సత్తయ్య గౌడ్, పి.ప్రతాప్ రెడ్డి లను కలెక్టర్ సత్కరించారు. వ్యాస రచన పోటీల విజేతలకు, ఎన్నికల విధుల్లో పాల్గొన్న బీఎల్ఓలకు అవార్డులు అందజేశారు. యువ ఓటర్లకు ఓటర్ కార్డులు పంపిణీ చేసి, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రంగవల్లి పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, స్వీప్ నోడల్ అధికారి శ్రీలతతో పాటు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్‌తో చికిత్సకు భరోసా

- **ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**ముద్ర, మల్కాజిగిరి :**

మెరుగైన వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌ను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. మిర్జాలగూడ, గౌతమ్‌నగర్ డివిజన్‌కు చెందిన చౌలా ఫణి కుమార్‌కు వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం తరపున రూ. 2లక్షల విలువైన ఎల్ఓసీని ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా తమ వంతు కృషి నిరంతరం కొనసాగుతుందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. అవసరంలో ఉన్నవారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్ పాల్గొన్నారు.

## రాజా బహదూర్ ఆశయాలు నేటికీ మార్గదర్శకమే

- **ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ముద్ర, కాప్రా :**

స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ సంఘ సేవకులు రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ సమీపంలోని రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహం వద్ద ఆయన వర్ధంతి సందర్భంగా పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల కోసం నిరంతరం శక్తి వంచన లేకుండా కృషి చేసిన మహానీయుడిగా రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి చిరస్మరణీయుడని కొనియాడారు. ఆయన సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మల్లాపూర్ రెడ్డి సంఘం నాయకులు దోమ శ్రీనివాసులు రెడ్డి, ధర్మారెడ్డి, ముత్యంరెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# శిల్పారామంలో హస్తకళా వైభవం

- **శిల్పారామంలో హస్తకళా వైభవం**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన ఛత్తీస్‌గఢ్ గాంధీ శిల్పబజార్ హస్తకళా ఉత్సవం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. బస్తర్ జిల్లాకు చెందిన గోండ్ పెయింటింగ్స్, మెటల్ క్రాఫ్ట్స్, వెదురుతో తయారు చేసిన కళాకృతులు, గృహాలంకరణ వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విభిన్న హస్తకళా ఉత్పత్తులతో పాటు కళాకారుల నైపుణ్యాన్ని ప్రతిబింబించే ప్రదర్శనలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ ఉత్సవంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు మరింత రంగులద్దాయి. ఒడిస్సి నృత్య ప్రదర్శనలో శ్రీమతి సుస్మిత మిశ్ర శిష్యబృందం 'శుక్లాం బరధరం', 'స్థాయి', 'శ్రీహరిస్తోత్రం', 'బసంత్ పల్లవి', 'సంజనిరి', 'తరంగ్' వంటి అంశాలను దివ్యశ్రీ, ఆర్వీ, సౌమ్య, ఆద్య, సంప్రీతి, అంకిత, తన్వి తదితరులు ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. అలాగే కూచిపూడి నృత్య ప్రదర్శనలో శ్రీమతి నిహారిక చౌదరి శిష్యబృందం 'దంతం భజామి', 'బ్రహ్మాంజలి', 'జతిస్వరం', 'దశావతార శబ్దం', 'అన్నమాచార్య కీర్తనలు', 'శివ తాండవ స్తోత్రం', 'జావళి', 'కూచిపూడి తల్లికి వందనం' వంటి అంశాలను సమన్వి, లాలిత్య, మనస్విని, శ్రీష్టి, శృతి, నిత్య, హిమాన్వి, కైరా, నైనిక తదితరులు ప్రదర్శించి ప్రేక్షకుల అభినందనలు పొందారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

- **ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

**ముద్ర, దుండిగల్ :**

దుండిగల్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన 'దుండిగల్ ప్రీమియర్ లీగ్' కార్యక్రమాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి చూపి ఆరోగ్యంగా, దృఢంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శంభీపూర్ కృష్ణ, జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మేడ్చల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవి యాదవ్, జక్కుల కృష్ణ యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, జక్కుల శ్రీనివాస్ యాదవ్, కొల్తూరు మల్లేష్, ప్యాక్స్ ఎక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, నాయకులు కమ్మరి వీరేష్, నర్సింగ్ గౌడ్, ధారా మహేష్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# ధరణీనగర్ నాలా పనుల్లో జాప్యం వద్దు

- **అధికారులకు అరికెపూడి గాంధీ హెచ్చరిక**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

నియోజకవర్గంలోని అల్విన్ కాలనీ పరిధిలో అసంపూర్తిగా ఉన్న ధరణీనగర్ నాలా విస్తరణ పనులను పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరిగేషన్, ఎస్.ఎన్.డి.పీ అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల చెరువుల సుందరీకరణతోపాటు నాలాల విస్తరణ పనులు జాప్యానికి గురవుతున్నాయని విమర్శించారు. గతంలో శంకుస్థాపన చేసి 8 మీటర్ల వరకు నిర్మించిన పనులను ఇప్పుడు 20, 40 మీటర్లుగా పొడిగించాలని చెబుతూ కాలయాపన చేయడం సరికాదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పెండింగ్‌లో ఉన్న నాలా విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాలా విస్తరణతో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒకప్పుడు వరదలు వస్తే ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యేవారని, ఇప్పుడు విస్తరణ పనుల వల్ల లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభిస్తోందన్నారు. ప్రజా అవసరాల దృష్ట్యా ఈ పనులకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి, వర్షాకాలం ముందే పూర్తయ్యేలా చూడాలని సూచించారు. పనుల సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రధాన రహదారులపై పనులు జరుగుతున్న వేళ ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని గాంధీ పేర్కొన్నారు. నీటి ప్రవాహం సాఫీగా సాగేందుకు లెవల్స్ నిర్ధారించుకొని నిర్మాణాలు చేపట్టాలని, వరద ముంపు మళ్లీ పునరావృతం కాకుండా పనులు నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ దీరజ్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాశినాథ్ యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

### రష్యన్ సివిల్ వార్ (1917-1922)

కమ్యూనిస్టులు–ప్రతి కమ్యూని స్టుల మధ్య జరిగిన ఘర్షణ. ఆకలి,



హింసతో 70 లక్షల మందికి పైగా మృతి చెందారు.

## సింగరేణి ఉత్తమ ఉద్యోగులు

**ముద్ర, కరీంనగర్:**
77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేశామని రామగుండం–3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనే జర్ కొలిపాక నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం–3 ఏరియా నుంచి ఉత్తమ అధికారిగా ఓసీ–1లో ప్రాజెక్ట్ ఇంజినీర్ గా విధులు నిర్వహిస్తున్న ఎ.ఉదయ భాస్కర్, ఉత్త మ సింగరేణియన్ గా ఓసీ–1లో హెడ్ ఓవర్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న యం.సాంబయ్య, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా నుంచి ఉత్తమ అధికారిగా పెండ్యాల వేణు, ఉత్తమ సింగరేణియన్ గా బి.ఓదెలు ఎంపికయ్యారని తెలిపారు. కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో జరిగే ప్రధాన వేడుకల్లో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వీరిని సన్మానిస్తారని తెలిపారు.

రామగుండం–3 ఏరియా నుంచి ఉత్తమ ఉద్యోగులుగా మామిడి సాంబయ్య, నాయిని రవి, బి. రామచంద్రం, షేక్ పాషా, బొల్లం శ్రీనివాస్. అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా నుంచి డి.రామమూర్తి, యం.వెంకట సాయి ఎంపికయ్యారని తెలిపారు. వీరికి స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో సన్మానించనున్నట్లు వారు చెప్పారు.

# మావోయిస్ట్ మాజీ నేత 'పుల్లూరి'కి ఆత్మీయ సన్మానం

### 45 ఏండ్ల తర్వాత అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిన ప్రసాద్ రావు
### గజమాలతో సన్మానించిన గ్రామస్తులు.. సొంతింటికి వెళ్లి మురిసిపోయిన 'పుల్లూరి'

**ముద్ర, పెద్దపల్లి:**
ఇటీవల పోలీసులకు లొంగిపోయిన మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్ రావు ఎలియాస్ చంద్రన్న, శంకరన్నకు పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడ్కాపూర్ లో ఆదివారం గ్రామస్తులు ఆత్మీయంగా గజమాలతో సన్మానించారు. ఆయన సుమారు 45 ఏండ్ల తర్వాత అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిశారు.



ఈ సందర్భంగా ప్రసాద్ రావు తన సొంతింటికి వెళ్ళి మురిసి పోయారు. తాను చదువుకున్న బడిలో అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. చిన్ననాటి మిత్రులు, బంధువులను కలిశారు. గ్రామస్తులను ఆత్మీయంగా పలకరిస్తూ మంచి చెడులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పుల్లూరి ప్రశాంతి, ఏఎంసీ మాజీ చైర్మన్ కంది చొక్క రెడ్డి, మాజీ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్ రావు, నాయకులు మాంకాలి తిరుపతి, మొగురం రాజేశం, ఎర్రోళ్ల రాములు, అడప లక్ష్మన్, ఆకుల రాజయ్య, చెన్నమనేని విద్యాసాగర్ రావు, కంది మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ




**ముద్ర, శంకరపట్నం:**
కరీంనగర్ జిల్లా మండల కేంద్రం శంకరపట్నంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యతను తెలిపే ప్లకార్డులు ప్రదర్శించారు. వయో ఓటర్లను తహసీల్దార్ సురేఖ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, యువకులు, గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాగోబా ఆలయంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు



**ముద్ర, ఇంద్రవెల్లి:**
ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబా ఆలయంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య నాగోబాను దర్శించుకొని పూజలు చేశారు. ఆదివారం సెలవు కావడంతో నాగోబా జాతరకు భక్తులు తరలి వచ్చారు. బారులు తీరి నాగోబా దర్శనం తీసుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మేస్రం వంశీయులు చైర్మన్ ను శాలువాతో సత్కరించి నాగోబా చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్, శంకర్, ప్రవీణ్, లక్ష్మి నారాయణ, డీఎస్డీవో సునీత, డీటీ డబ్ల్యూ అంబాజీ, ఎస్ డబ్ల్యూవోలు నర్సింగ్, నారాయణ రెడ్డి, కేస్లాపూర్ సర్పంచ్ మెస్రం తుకారాం, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్ రావు, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

**ముద్ర, తాండూర్:**
తాండూర్ మండల కేంద్రం ఐబీ సమీపంలో ఆదివారం రెండు బైకులు ఢీకొని ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పాత ఆంధ్ర బ్యాంకు వద్ద సర్వీసు రోడ్డుపై ఎస్సీ కాలనీకి చెందిన నిఖిల్ అనే యువకుడు ఐబీ కేంద్రం నుంచి స్టేట్ బ్యాంకు వైపు వస్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నిఖిల్ తో పాటు పులికుంట గ్రామానికి చెందిన సాయి, రాజేష్ కు గాయా లయ్యాయ. సంఘటన స్థలాన్ని తాండూర్ ఏఎస్సై మీర్ ఉస్మాన్ అలీ, కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్ లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు.

## నిరుపేద కుటుంబానికి సాయం




**ముద్ర, పెద్దపల్లి:**
పెద్దపల్లి జిల్లాలోని కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలోని నిరుపేద కుటుంబానికి సుందరం పౌండేషన్ సాయం అందించింది. నిరుపేద తాటికొండ సత్తయ్య, విమల దంపతుల ఇంటికి ఆదివారం సుందరం పౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బోనాల వెంకటస్వామి వెళ్లి వారి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు రూ.వెయ్యి ఆర్థిక సాయం అందజేశారు. రొంపికుంట గ్రామానికి చెందిన గన్నెవరపు నర్సయ్య నిరుపేద కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలపడంతోనే ఆ కుటుంబ పరిస్థితి తెలుసుకుని తమ వంతుగా సహకారం అందించినట్లు వెల్లడించారు. కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు తమ సుందరం పౌండేషన్ అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సుందరం ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కన్నూరి నగేష్, సభ్యులు చెన్నోజు చంద్రశేఖర్, దాసరి రమేష్, సిద్ధు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రక గుర్తింపు కలిగిన ప్రదేశాల సందర్శనతో విద్యార్థులకు విజ్ఞానం

### కర్ణాటక, తమిళనాడుల్లో చారిత్రక ప్రదేశాలను సందర్శించిన 'విశ్వభారతి' విద్యార్థులు

**ముద్ర, గోదావరిఖని:**
చారిత్రక గుర్తింపు కలిగిన ప్రదేశాల సందర్శనతో విద్యార్థులకు విజ్ఞానం, నైపుణ్యతను పెంపొందించవచ్చని విశ్వభారతి విద్యాసంస్థల యాజమాన్యం ఎన్టీపీసీలోని విశ్వభారతి స్కూల్ విద్యార్థులను సౌత్ ఇండియాలో చారత్రక ప్రదేశాలు కర్ణాటక, తమిళనాడు స్టడీ విహారయాత్రకు తీసుకు వెళ్లారు. అక్కడ విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సహంగా అహ్లాదకరమైన వాతావరణంలో గుర్తింపు కలిగి ప్రదేశాలను ప్రత్యేక్షంగా చూసి వాటి చరిత్రను అవగాహన చేసుకుంటున్నారు.



బెంగళూర్, మైసూర్ లో విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ మ్యూజియం, మైసూర్ ప్యాలెస్, ఊటిలో బొటానికల్ గార్డెన్, టీ చాక్లెట్ ఫ్యాక్టరీ, దొడ్డబెట్ట శిఖరం, అధ్యాత్మిక ప్రదేశాలు ఇస్కాన్ టెంపుల్, శ్రావణ బెళగొళ, హళేబీడు, బేలూర్ చేన్నకేశవ దేవాలయాలు, చాముండి కొండలు, బృందావన్ గార్డెన్ సందర్శనతో ఆహ్లాదకరమైన వాతావరణం లో గత ఐదు రోజులుగా విద్యార్థులకు వాటి విశిష్టత, చరిత్రపై స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, హెచ్ఎం తిరుపతిగౌడ్, అధ్యాపకులు అవగాహన కల్పిస్తున్నారు.

### సూపర్ స్పెషాలిటీ వైద్య విద్య ప్రవేశ పరీక్షలో
## ఆల్ ఇండియా మూడవ ర్యాంక్ సాధించిన లిఖిత

**ముద్ర, వేములవాడ.**
సూపర్ స్పెషాలిటీ వైద్య విద్య ప్రవేశ పరీక్షలో వేములవాడ వైద్యురాలు డాక్టర్ ఉడుతల లిఖిత ఆల్ ఇండియా 3వ ర్యాంక్ సాధించారు. వేములవాడ పట్టణానికి చెం దిన ఉడతల వెంకన్న విజయ దంపతుల రెండో కూతురు లిఖిత ఎంబీబీఎస్ గాంధీ ఆసుపత్రిలో పూర్తి చేశారు. పీజీ ఎండీని కూడా గాంధీలోనే పూర్తి చేయగా గోల్డ్ మెడల్ సాధించారు.

ఊపిరితిత్తుల విభాగంలో వైద్య సేవలు అందించాలని నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్ష హాజ రుకాగా శనివారం విడుదలైన ఫలితాలలో ఆల్ ఇండియా మూడో ర్యాంకు సాధించగా వైద్యురాలని పలువురు అభినందించారు.



## ఆన్ లైన్ బెట్టింగుకు ఒకరి బలి

**ముద్ర, సారంగాపూర్:**
ఆన్లైన్ బెట్టింకు బానిపై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని రాణాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ ప్రేమ్‌కుమార్(39) ఆన్లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. దీనికి తోడు కొన్ని నెలల క్రితం ఫర్టిలైజర్ వ్యాపారంలో నష్టం వాటిల్లింది. ఆన్లైన్ బెట్టింగ్, ఫర్టిలైజర్ వ్యాపారంలో కలిపి రూ.70 లక్షలు నష్టపోవడంతో మనస్థానికి గురయ్యాడు.

ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు శనివారం ఉదయం వెతుకగా చించోలి(బి) సమీపంలోని మైనార్టీ విద్యాలయానికి దూరంలో ప్రేమ్ కుమార్ బ్లేడ్‌తో తనచేయి మణికట్టు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ ప్రదేశంలో పురుగులమందు డబ్బా కూడా లభించింది. ప్రేమ్‌కుమార్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇద్దరు మెడికల్ ఉద్యోగులపై కలెక్టర్ వేటు



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
ప్రభుత్వ దవాఖానలో గైర్హాజరైన ఇద్దరు ఉద్యోగులను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ దవాఖానలో పబ్లిక్ హెల్త్ డయాగ్నస్టిక్ ల్యాబ్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ దవాఖానలో ఉన్న పబ్లిక్ హెల్త్ డయాగ్నస్టిక్ లాబొరేటరీలో ఇద్దరు ఉద్యోగులు గైర్హాజరైనట్లు కలెక్టర్ తనిఖీలో రుజువైనందున ల్యాబ్ టెక్నిషియన్ ను సస్పెండ్ చేశారు. ల్యాబ్ మేనేజర్ కు షోకాజ్ నోటీసులు అందించారు.

## ఓటు హక్కు ప్రతీ ఒక్కరి బాధ్యత..
**– ఆర్డీవో రాధాబాయి**

**ముద్ర, వేములవాడ:**
ఓటు హక్కు ప్రతీ ఒక్కరి బాధ్యత అని వేములవాడ ఆర్డీవో రాధాబాయి అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం లో భాగంగా తహసీల్దార్ కార్యాలయం నుండి తెలంగాణ చౌక్ వరకు ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించగా ఆమె హాజరై మాట్లాడారు. 18 సంవత్సరాల నుండిన ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. స్వతంత్ర భారతదేశంలో పరిపాలనను నిర్దేశించేది ఓటు హక్కు ద్వారానే వివరించారు. అలాంటి ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ నమోదు చేయించుకోవడమే కాకుండా బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సురేష్, ఆర్ఐలు శ్రీనివాస్, శ్రీధర్, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
26.01.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



నెపోలియన్ యుద్ధాలు (1803–1815)
నెపోలియన్ బోనపార్ట్ ఆధిపత్యం కోసం యూరప్ మొత్తం యుద్ధభూమిగా మారింది. 35 లక్షల మందికి పైగా ప్రాణనష్టం.



# పాత పద్ధతులకు స్వస్తి.. ఆధునిక రోవర్స్‌తో కొలతలు

- క్షేత్రస్థాయిలోకి లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- అర్హత సాధించిన 47 మందికి నియామక పత్రాలు అందజేత
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ముద్ర, ఖమ్మం:**

భూములకు సంబంధించి ప్రతి అంగుళాన్ని డిజిటలైజ్ చేసి, యజమానులకు శాశ్వత యాజమాన్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 'ధరణి' ద్వారా సృష్టించిన చిక్కుముడులను విప్పుతూ.. రైతులకు చుట్టంలా ఉండేలా 'భూ భారతి' చట్టాన్ని అమలులోకి తెచ్చామని ఆయన వెల్లడించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ (ఐడీఓసీ)లో శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "గతంలోని టేపులు, గొలుసుల పద్ధతులకు స్వస్తి పలికి, సెంటీమీటర్ల తేడాతో ఖచ్చితత్వం వచ్చేలా 'రోవర్స్' సాంకేతికతను వాడుతున్నాం. ఇప్పటికే 600 రోవర్లను కొనుగోలు చేసి జిల్లాలకు పంపిణీ చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ పొందిన 5,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను మండలాల వారీగా భూ విస్తీర్ణం ప్రాతిపదికన కేటాయించాం" అని వివరించారు. ఖమ్మం జిల్లాలో రెండో విడతలో అర్హత సాధించిన 47 మందికి నియామక పత్రాలు అందజేశామని, వీరంతా పారదర్శకతతో పనిచేయాలని సూచించారు.



**అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం**

హైదరాబాద్ నాంపల్లి అగ్నిప్రమాద ఘటనపై మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బాధితులకు అండగా ఉండాలని ఆదేశించారన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ధరణి అక్రమాలపై ఉక్కుపాదం**

ధరణిలో జరిగిన లోపాలపై ఇప్పటికే సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి చేశామని, ఆ నివేదికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 31 జిల్లాల్లోనూ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని, ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.





# దళితులపై ఆయనది యాదవ్ కపట ప్రేమ

**ముద్ర, మునగాల:**

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతుల ను విమర్శించే స్థాయి కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కు లేదని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మునగాల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం గణపవరం క్రాస్ రోడ్డు వద్ద మల్లయ్య యాదవ్ దిష్టి బొమ్మను దహనం చేశారు మల్లయ్య యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మునగపాకలో ఆందోళన నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతుల ను విమర్శించే స్థాయి కాదని, దళిత బంధు పేరుతో మోసం చేసి ఇప్పుడు అధికారం పోయాక దళితులపై ప్రేమ పుట్టుకొచ్చిందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, కాసర్ల కోటయ్య, ఉప్పల జానకి రెడ్డి, సర్పంచులు సుంకర పిచ్చయ్య, మట్టయ్య ,గ్రామ శాఖ అధ్యక్షులు ఈధారావు, ఉప సర్పంచ్ వెంకట్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ గౌడ్ , పనస విజయ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు సాయి ,అంజయ్య ,గిరి, రవి ఎల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# కలకలం రేపుతున్న పులి సంచారం

- రాళ్ల జనగాంలో దూడ మృతి
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదగిరిగుట్ట మండలం రాళ్ల జనగాం గ్రామ పరిధిలోని వ్యవసాయ బావి వద్ద పులి సంచారం కలకలం రేపుతోంది. పులి దాడి చేయడంతో ఓ దూడ మృత్యువాతపడినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాప్ కెమెరాల సహాయంతో, డ్రోన్ కెమెరాల సహాయం తో, ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గుర్తించాలని తెలిపారు. బాధిత రైతును పరామర్శించారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, పశువులను రాత్రి వేళల్లో సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు.



# భువనగిరి జిల్లా కలెక్టర్ కు పురస్కారం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 2025 సంవత్సరానికి గాను ఎన్నికల నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన అధికారుల జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి శనివారం ప్రకటించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన రాష్ట్రస్థాయి వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం పట్ల జిల్లా అధికారులు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించిన ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఎన్నికల నిర్వహణ లో భాగస్వామ్యం అయిన ప్రతీ ఒక్క అధికారికి కలెక్టర్ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. సమిష్టి కృషి వల్లనే మన జిల్లా కి ఈ అవార్డు దక్కిందని తెలిపారు.

# ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలని స్థానిక సంస్థల, రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. ఆదివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుండి పట్టణ పుర విధుల్లో ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కునువినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధంతో ఓటర్లు తమకు నచ్చిన వారిని పాలకులుగా ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం కల్పించినందున, ఈ హక్కును ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో క్రమం తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్న సీనియర్ సిటిజన్లను, కొత్తగా నమోదైన యువ ఓటర్లను జిల్లా యంత్రాంగం తరపున జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు. కొత్త ఓటర్లకు ఎన్నికల గుర్తింపు కార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# బొల్లం క్షమాపణలు చెప్పాలి

- మున్సిపల్ ఎన్నికల లబ్ధికే దళితులపై ప్రేమ

**ముద్ర నడిగూడెం :**

మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశ్యంతోనే దళితులపై ఎనలేని ప్రేమ ఉన్నట్లు బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులపై కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉప సంహరించుకుని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ , కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు భూత్కూరి వెంకటరెడ్డి లు డిమాండ్ చేశారు. ఆదివారం నడిగూడెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి అభివృద్ధి చేయకుండా మట్టి దందా, లిక్కర్ దందాలు నడిపిన వారు ఇప్పుడు ఎనలేని ప్రేమను కురిపిస్తున్నారని అన్నారు. సొంత గ్రామం కరివిరాల మహిళా సర్పంచి పైన అక్రమ కేసులు పెట్టించిన చరిత్రహీనుడు బొల్లం మల్లయ్య అని అన్నారు. కళ్యాణ లక్ష్మి, సిఎంఆర్ఎఫ్, షాది ముబారక్ చెక్కుల అవినీతికి మూలం మల్లయ్య అని అన్నారు. నీతిగా నిజాయితీగా పాలన కొనసాగిస్తు అభివృద్ధి చేస్తున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి పైన వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు దున్న శ్రీనివాస్, వేల్పుల సోమయ్య, దాట్ల నాగేశ్వరరావు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు కాసాని శివలింగం, మండల మహిళా అధ్యక్షురాలు ముదిరెడ్డి నలినీ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, మాజీ వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండు మహేందర్, కరివిరాల మాజీ సర్పంచ్ నీలిమా గాంధీ, పగడాల ప్రభాకర్, నాయకులు దేవబత్తిని రమేష్ ప్రసాద్, మొక్క బిక్షపతి, శెట్టి సతీష్, విజయవర్ధన్ రెడ్డి, వినయవర్ధన్ బాబు ,కాసాని వెంకన్న, కంభంపాటి చైతన్య, వెంకటనారాయణ, శ్రీకాంత్,రియాజ్, లింగయ్య, ఉపేందర్, వీరబాబు, రవి, వీరబాబు,పల్లపు శ్రీను వెంకటేశ్వర్లు,మౌలానా, విజయ్,దినేష్, ఎలక, రామిరెడ్డి, కాసాని పుల్లయ్య వేణు, వీరబాబు, నాగరాజు మధు, కే శ్రీను,గ్రామ శాఖ అధ్యక్షులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





# రోడ్డు పనులకు శంకుస్థాపన

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

డాల్ఫిన్ హోటల్ నుండి శ్రీ త్రిశక్తి మహా గాయత్రీ మందిరం వరకు రోడ్డు వేసే పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో మహిమాన్వితమైన శ్రీ త్రిశక్తి మహా గాయత్రి మందిరం, ధ్యాన ప్రస్థానం, వరకు రహదారి నిర్మాణానికి, మున్సిపల్ కమిషనర్ సూచనలు తీసుకుని కాంట్రాక్టర్ కుఆదేశాలు జారీ చేశామన్నారు. దివ్యజ్ఞాన గురూజీ మాట్లాడుతూ భువనగిరి శాసనసభ్యులు తీసుకున్న ప్రధాన రహదారి నుండి దేవాలయాల వరకు రహదారి నిర్మాణాలకు ఆదేశాలు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. నిర్మాణ పనులు చేపట్టడం పట్ల శ్రీ గాయత్రీ చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు చందుపట్ల వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ కే రాధాకృష్ణమూర్తి, సభ్యులు భాస్కరరావు, జయంతి, దివ్యజ్ఞాన గురూజీ శారద, ఆకవరం రమేష్, పాదరాజు శ్యామ్, పాలెం కిషన్ రావు, సిహెచ్ రాజేశ్వరరావు, సిహెచ్ విశ్వేశ్వరరావు, తంగళ్ళపల్లి రవికుమార్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తీ, కూర వెంకటేష్, కూకడుగు సోమయ్య, పోతంశెట్టి మంజుల వెంకటేష్, కమిషనర్ రాజలింగం పాల్గొన్నారు.

# యాదాద్రిలో సీఎం పీఆర్వో ప్రత్యేక పూజలు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీఆర్వో శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనం అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిఆర్వో ఆదిమూలం సురేష్, భక్తులు పాల్గొన్నారు.



# మంత్రి ఉత్తమ్ జోలికొస్తే సహించం

- కాంగ్రెస్ నాయకులు హెచ్చరిక

**ముద్ర, కోదాడ ప్రతినిధి:**

మంత్రి ఉత్తమ్ దంపతుల జోలికొస్తే సహించమని కోదాడ మాజీ ఎమ్మెల్యే మల్లయ్యను పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు . ఆదివారం మంత్రి ఉత్తమ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. శనివారం నిర్వహించిన చలో కోదాడ నిరసన సభలో కోదాడ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య మంత్రి ఉత్తమ్ దంపతుల పై వ్యక్తిగత విమర్శలకు దిగడంపై మండిపడ్డారు. పట్టణ సిఐ శివశంకర్ నాయక్ పై వ్యక్తిగత దూషణలకు దిగడంపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సుమోటోగా మల్లయ్య పై కేసు నమోదు చేయాలన్నారు . గడచిన ఐదేళ్లలో మల్లయ్య ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో షాడో ఎమ్మెల్యే గా ఎవరు ఉన్నారో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. మట్టి , ఇసుక , లిక్కర్ లపై అనధికార టాక్స్ వసూలు చేసిన ఘనత ఎవరిదో తెలుసని , ఇప్పుడు అలాంటి టాక్స్ లు ఏమీ లేవని ఇది నియోజకవర్గం మొత్తం తెలుసని అన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు , టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి , ఎర్నేని వెంకటరత్నం బాబు , చింతలపాటి శ్రీను , పారా సీతయ్య, బషీర్ , ఈదుల కృష్ణయ్య, కందుల కోటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు .



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 26-01-2026
www.mudranews.in | @mudranews



**కొరియన్ యుద్ధం (1950–1953)**

ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య జరిగిన ఈ యుద్ధం ఇప్పటికీ పూర్తిగా ముగియలేదు. 30 లక్షల మంది మృతి చెందారు.



# ఘనంగా రథ సప్తమి వేడుకలు



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** పట్టణంలోని కొమటి చెరువు రూబీ నెక్లెస్ పై ఆదివారం వ్యాస మహర్షి యోగా సొసైటీ సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ యోగా గురువు, రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యులు తోట సతీష్, సంధ్యల నేతృత్వంలో ఆదిత్య శ్లోకంతో కార్యక్రమం ప్రారంభమైంది. సూక్ష్మ యోగ అనంతరం సూర్యుణ్ణి స్తుతిస్తూ లయబద్ధంగా సూర్య నమస్కారాలు సామూహికంగా నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు.

**భారతదేశం ప్రపంచానికి దిక్సూచి..**

సామూహిక సూర్య నమస్కారాల అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి, ప్రముఖ వైద్యులు ప్రణీత్ మాట్లాడుతూ యోగా అంతర్గత, బహిర్గత కాలుష్యాలను దూరం చేస్తుందని చెప్పారు. యోగాను జీవితంలో భాగం చేసుకున్నవారు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఇతర క్రీడల్లో సామగ్రి అవసరం ఉంటుందని, యోగా అభ్యసనలో ఏలాంటి పరికరాలు లేకుండా సులభంగా సాధన చేసుకోవచ్చని సూచించారు. వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీలు, శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన నిర్వహించినట్లు చెప్పారు. నాలుగు లక్షల సూర్య నమస్కారాలతో నిర్వహించిన ఉత్సవం వండర్ బుక్ ఆఫ్ రికార్డులోకి నమోదైనట్టు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన యోగా విద్య నేడు ప్రపంచానికి దిక్సూచిగా మారిందని తెలిపారు. సిద్దిపేట అన్ని రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులను గెలుచుకున్నట్లే యోగా రంగంలో కూడా సిద్దిపేట నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి యువ క్రీడాకారులు ఎదుగుతున్నారని తెలిపారు. . కాని యోగ విద్యతో పొందిన ఆరోగ్యాన్ని బంధువులు, మిత్రులకు అంద జేయడం ద్వారా వారికి అద్భుతమైన కానుక ఇచ్చినట్లు అవుతుందని తెలిపారు. ప్రసంస్కార భారతి అధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ యోగము న్నవారికి మాత్రమే యోగ విద్య దక్కుతుందన్నారు. సిద్దిపేట ఖ్యాతిని పెంచుతున్న సిద్దిపేట జిల్లా యోగా అసోసియేషన్, వ్యాస మహర్షి యోగ సొసైటీలను ఆమె అభినందించారు. మున్సిపల్ కౌన్సిలర్ సాయి మాట్లాడుతూ వివిధ రకాల ఒత్తిడిలను జయించడానికి యోగా ఉపయోగపడుతుందని తెలిపారు. యోగా అసోసియేషన్ చీఫ్ పాటర్న్ చిప్ప ప్రభాకర్ మాట్లాడుతూ యోగ సాధన వల్ల తాను ఆరోగ్యంగా ఉన్నానన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కొమరవెల్లి అంజయ్య, TNGO సిద్దిపేట జిల్లా ప్రధాన కార్య దర్శి విక్రం రెడ్డి, STU సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి పట్నం భూపాల్, TPUS రాష్ట్ర బాధ్యులు శ్రీనాకర్ రెడ్డి, సంతోషి మాత దేవాలయం పూర్వ చైర్మన్ మంకాల నవీన్, పతాంజలి యోగా సమితి చీఫ్ పాట్రన్ అంజయ్య, యోగా అసోసియేషన్ సభ్యులు బసవరాజు కుమార్, సురేష్, స్వామి, ఆనంద్ పాల్గొన్నారు

## త్రివర్ణ శోభితం మెదక్ కలెక్టరేట్..



**ముద్ర ప్రతినిధి, మెదక్:** గణతంత్ర దినోత్సవ వేడుకలకు మెదక్ కలెక్టరేట్ ముస్తాబైంది. కలెక్టర్ కార్యాలయం విద్యుత్ కాంతులతో త్రివర్ణమయంగా ధగ దగలాడుతోంది.

## విద్యతో పాటు క్రీడలో రాణించాలి



**సిద్దిపేట (తోగుట), ముద్ర ప్రతినిధి:** యువత విద్యతోపాటు క్రీడలో రాణించాలని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజక వర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని లింగాపూర్ లో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మెన్, సర్పంచ్ గాంధారి లత నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో 15 రోజులగా జరుతున్న దుబ్బాక నియోజక వర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సభకు అయన ముఖ్య అథితిగా హాజరయ్యారు. గెలుపొందిన దౌల్తాబాద్ టీంకు బహుమతి ఇరవై వేల రూపాయలు, రెండో బహుమతి లింగాపుర్ కు బహుమతి పది వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని, ఆరోగ్యవంతంగా ఉంటరాన్నారు. క్రీడల్లో గెలుపు ఓటము లు సహజమని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్, లింగాపూర్ సర్పంచ్ గాంధారి లత నరేందర్ రెడ్డి, సర్పంచ్ పాగల శోభ కొండల్, దౌల్తాబాద్ సర్పంచ్ అనురాధ రమేష్ రెడ్డి, రమేష్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు మైపాల్ రెడ్డి, వెంకటేశం, భూపాల్ నిరంజన్ రెడ్డి, కిష్టయ్య, కృష్ణ గౌడ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## రామదాసు జయంతికి మజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** భద్రాచల రామదాసు జయంతోత్సవాల కార్యక్రమాల ప్రత్యేక శుభ ఆహ్వాన పత్రికను ఆదివారం శ్రీరామకోటి భక్తి సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ భద్రాచల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరిగే భక్త రామదాసు జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను రామకోటి రామరాజు ద్వారా అందుకోవడం అదృష్టంగా భావి స్తునానని తెలిపారు. ఆధ్యాత్మిక కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ ఖాన్, అశోక్ రెడ్డి, నంగునూరి సత్యనారాయణ, తలకొక్కుల ప్రేమ్ కుమార్, మున్నా, షాహెద్, రాజు తది తరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ లో ఇష్టారీతిగా నిధుల కేటాయింపు




**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** సిద్దిపేట మున్సిపాలిటీలో ఇష్టారీతిగా నిధుల కేటాయిస్తున్నారని పట్టణ కాంగ్రెస్ నాయకులు అలకుంట మహేందర్, సాకి ఆనంద్, కౌన్సిలర్ రియాజుద్దీన్ ఆరోపించారు. ఆదివారం వారు సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యకుడు అత్తూ ఇమామ్ తో కలిసి విలేకరుల సమావేశం లో మాట్లాడారు. పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘంలో ఇప్పటికే ఫంక్షన్ లు చేయడం ప్రారంభం అయ్యాయని, మున్సిపాలిటీ నుంచి రూ .10 లక్షలు మిగులు బడ్జెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అలాగే పట్టణంలోని 12 వార్డులో వ్యవసాయ క్షేత్రానికి రోడ్లు వేసుకోవడం సిగ్గుచేటన్నారు. కాలనీలో కొన్ని చోట్ల రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సొంత పొలానికి రోడ్లు వేయించుక్కవడం ప్రజల పన్నులను దుర్వినియోగం చేయడమే అన్నారు. ఇప్పటికే మున్సిపల్ కి కోటి రూపాయల కరెంటు బిల్లు పెండింగ్ లో ఉందన్నారు. మున్నిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ కుమ్మక్కయి ఆడుతున్నా నాటకాలని ఆరోపించారు. కోట్ల రూపాయలను పక్కదారి మళ్లిస్తున్నారన్నారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ ను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు సాకి ఆనంద్ మాట్లాడుతూ మున్సిపల్లో జనరల్ ఫండ్ అనేది 43 వార్డుల్లో అభివృద్ధి పనులకు కేటీయించాలన్నారు. కాని గుళ్లకు. సంఘాలకు, మసీద్ లకు తాము వ్యతిరేకం కాదన్నారు. కాని ఉద్దేశ్యం పూర్వకంగా కొన్ని సంఘాలకు నిధులు కేటీయించడం తగదన్నారు. కుషాల్ నగర్ లో మాల శ్మశాన వాటికకు రూపాయి నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి ఆలోచన చేయడం లేదన్నారు. ఏజెండాలో అంశాలు పెడుతూ ఎవరికి అర్థం కాకుండా దోచుకుంటున్నారని విమర్శించారు. ఇలాంటి విషయాలపై కమిషనర్ కూడా వత్తాసు పలుకడం బాధాకరమన్నారు. 43 వార్డు ప్రజల పన్నులు అభివృద్ధి కి వాడాలని, కాని సంఘాలకు వాడడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. మీ జాగిరు కాదని స్పష్టం చేశారు. 20 వ వార్డు కౌన్సిలర్ రియాజ్ మాట్లాడుతూ దళితులు, మైనార్టీ లు అంటే అంత చులకన అని ప్రశ్నించారు. నిధులన్నీ కోమటి చెరువుకు కేటాయిస్తూ మిగతా వాటిని విస్మరించడం తగదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మదీనా ఫంక్షన్ హాల్ కు 25 లక్షలు మంజూరు చేస్తామని చెప్పి మొత్తం నిధులు ఇవ్వలేదన్నారు.

సిద్దిపేట లో కోమటి చెరువు తప్ప మిగతా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ది చెబుతారన్నారు. సిద్దిపేట మైనారిటీ ల జనాభా ఎక్కువగా ఉందని, ఇక్కడి యువత కోచింగ్ ల పేరిట హైదరాబాద్ కు వెళ్లకుండా ఇక్కడే మైనారిటీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చెస్తానని తెలిపిన హరీష్ రావు వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. మైనారిటీలు, దళితులు అంటే చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలో వారికి అనుకూమైన వార్డులకు మాత్రమే నిధులు కేటాయియించడం తగదన్నారు. పట్టణంలోని మిగతా వార్డులపై ఎందుకంత వివక్ష అని వారు ప్రశ్నించారు.

## ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

**- కలెక్టర్ రాహుల్ రాజ్**

**- మెదక్ లో భారీ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ దంపతులు**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం, 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. 16వ వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురష్కరించుకొని మెదక్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్, శ్రీజ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జూనియర్ కళాశాల గ్రౌండ్ లో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కుపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు.

18 సంవత్సరాలు పూర్తయిన ఎనిమిది మంది యువకులకు ఓటు హక్కు కల్పిస్తూ బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ప్రజాస్వామ్యంలో 85 సంవత్సరాల నుంచి ఓటు హక్కు వినియోగించుకున్న ముగ్గురు సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్డీఓ రమాదేవి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, జిల్లా అధికారులు విజయ, దేవకుమార్, రామచంద్ర రాజు, మాధవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, ఎన్నికల తహసీల్దార్ గఫార్, డీఎస్పీ ప్రసన్నకుమార్, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**ఉత్తమ స్వీప్ అధికారిగా రాజిరెడ్డి..**

16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం, జిల్లాలో జరిగే ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడంలో భాగస్వాములైన జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డికి కలెక్టర్ రాహుల్ రాజ్ మెమెంటో, సర్టిఫికెట్ అందజేశారు. గతంలో ఆయన రాష్ట్ర ఎన్నికల అధికారి నుంచి ఉత్తమ స్వీప్ నోడల్ అధికారిగా అవార్డు అందుకున్నారు.



# శిశు మందిర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**ముద్ర ప్రతినిధి, మెదక్:** క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించిన విద్యా సంస్థలో వారందరు చదివారు. పాఠశాల ఆవిర్భవించిన నాటి నుంచి యాభై ఏళ్లలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఒక చోట కలిశారు. ఇందుకు మెదక్ లోని వినాయక కన్వెన్షన్ హాల్ వేదికైంది. పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ 1971–2018 వరకు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులు, పూర్వ ఆచార్యుల సమ్మేళనం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన శ్రీ సరస్వతి విద్యా పీఠం తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద విద్య శిక్షణ సంస్థ సరస్వతి శిశుమందిర్ అన్నారు. ఇందులో చదివిన విద్యార్థులు విలువలు, సంస్కారంతో పెరిగారని తెలిపారు. ప్రతి మండలంలో శిశు మందిర్ పాఠశాల ఉండాలని, జిల్లా కేంద్రంలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు దీటుగా ఉండాలని పేర్కొన్నారు.

క్షేత్ర పూర్వ విద్యార్థి పరిషత్ సంయోజక్ హరి స్మరణ్ రెడ్డి మాట్లాడుతూ యువతను జాగృతం చేసేందుకు, సనాతన ధర్మం వైపు తీసుకెళ్లేందుకు 1952లో గోరక్ పూర్ లో శిశు మందిర్ పాఠశాల ప్రారంభం అయిందన్నారు. కోటికి పైగా ఉన్న పూర్వ విద్యార్థులు అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్నారని అన్నారు. పూర్వ విద్యార్థి సీఐ మల్కాజి రాఘవేంద్ర మాట్లాడుతూ శిశు మందిర్ పాఠశాలలో చదవడం పూర్వ జన్మ సుకృతమన్నారు. పాఠశాలలో చిన్నప్పుడు ఖాకీ యూనిఫాం ధరించిన తనకు నిజ జీవతంలో భాగమైందన్నారు. మరో పూర్వ విద్యార్థి సీఐ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ శిశు మందిర్ పాఠశాల చదువుతో పాటు విలువలు నేర్పాయన్నారు. అటవీ శాఖ రేంజ్ అధికారి విష్ణువర్ధన్ రావు మాట్లాడారు. పట్టణంలో నిర్మించే పాఠశాల నూతన భవన నిర్మాణనికి పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున విరాళాలు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల అలరించాయి. సమ్మేళనానికి వేయి మంది పూర్వ విద్యార్థులు, 150 మంది పూర్వ ప్రధాన ఆచార్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రబంధకారిణి అధ్యక్షులు గంజి శ్రీనివాస్, కార్యదర్శి దేవదత్తు, సహా కార్యదర్శి సుధాకర్, శిశు మందిర్ సమితి అధ్యక్షులు డా. భానుచందర్, సహా అధ్యక్షులు బండి వెంకటేశ్వర్లు, మెదక్ విభాగ్ కార్యవాహ నాగభూషణం, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి చైర్మెన్ రాజ్ కుమార్, పాఠశాల ప్రధానాచార్యులు ఆనంద్ రెడ్డి, విభాగ్ శైక్షనిక్ ప్రముఖ్ వెంకట్ రాంరెడ్డి, పాఠశాల బాధ్యులు మల్కాజీ సత్యనారాయణ, చోళ పవన్, నారాయణ, పిప్పిరి రవీందర్, సమ్మేళనం నిర్వాహకులు బండి నరేష్, రాఘవేందర్, శివ భార్గవ్, నవీన్, సంతోష్ కుమార్, సుధాకర్, నాగరాజు, ప్రబంధకారిణి, సమితి సభ్యులు, పాఠశాల ఆచార్య బృందం తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.01.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వియత్నాం యుద్ధం (1955–1975)**

అమెరికా జోక్యంతో తీవ్రతరమైన ఈ యుద్ధం పౌరులపై భయంకర ప్రభావం చూపింది. సుమారు 25–30 లక్షల మరణాలు.





## జీహెచ్ఎంసీ కమిషనర్‌కు పురస్కారం

- **గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం**
- **జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను విజయవంతం చేసినందుకు గుర్తింపు**

**ముద్ర, హైదరాబాద్ :**

జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికను విజయవంతంగా, శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించినందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ , హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రత్యేక పురస్కారాన్ని ప్రదానం చేశారు. రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో డ్రోన్ సర్వైలెన్స్ సాంకేతికతను వినూత్నంగా వినియోగించిన కర్ణన్ తీరును గవర్నర్ ప్రశంసించారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించడంలో, భద్రతను మరింత పటిష్టం చేయడంలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషించిందని తెలిపారు. కర్ణన్ నాయకత్వంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం చేపట్టిన ముందస్తు చర్యలను గవర్నర్ అభినందించారు. ఫలితంగా పోలింగ్ ప్రక్రియ సజావుగా, భద్రంగా, సమర్థవంతంగా నిర్వహించగలిగారని పేర్కొన్నారు. ఆర్ వి కర్ణన్ నేతృత్వంలో జిల్లా ఎన్నికల బృందం చూపిన అద్భుత సమన్వయం, అంకితభావం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడంతో పాటు ఓటర్ల విశ్వాసాన్ని పెంపొందించిందని గవర్నర్ కొనియాడారు.

## ట్రంప్ నిర్ణయంతో ఇండియాకు భారీ లాభం

**ముద్ర డెస్క్ :**

హెచ్ 1 బీ వీసా వ్యవస్థ ప్రధాన లక్ష్యం నీరుగారుతోంది. అది ఇండియాకు అనుకూలంగా మారుతోంది. అమెరికా హెచ్ 1బీ వీసాను తీసుకురావడం వెనుక ఉన్న కారణం.. అమెరికాలోని కంపెనీలు విదేశాల్లో ఉన్న నిపుణులను నియమించుకోవడం కోసం. కానీ హెచ్ 1 బీ వీసా వ్యవస్థలో వస్తున్న మార్పులు, అమెరికా తీసుకుంటున్న నిర్ణయాలు, తరుచూ వీసాలు తనిఖీ చేయడం, ఇంటర్వ్యూలు ఆలస్యం కావడం.. ఇండియన్ టెక్ నిపుణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వారి ఆలోచన తీరును మార్చుతున్నాయి. ఎందుకంటే.. ఇండియాలో ఉన్న నిపుణులు ఉద్యోగం చేయడానికి అమెరికాను మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకుంటారు. అందుకే టెక్ రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, సాఫ్ట్ వేర్ డెవలప్మెంట్ రంగాల్లోని భారత నిపుణులు దశాబ్దాలుగా అమెరికాకు వెళ్తున్నారు. కానీ ఇటీవల జరుగుతున్న మార్పులు వారిని ఆలోచింపజేస్తున్నాయి. దీంతో అమెరికా నుంచి ఇండియాకు రావాలని చాలా మంది ఆలోచిస్తున్నారు.



అమెరికా వెళ్లాలనుకున్న వారు ఇండియాలోనే ఉద్యోగం చేయాలని భావిస్తున్నారు.

అమెరికా హెచ్ 1 బీ వీసా వ్యవస్థలో తీసుకున్న మార్పులు.. ఇండియాకు అనుకూలంగా మారుతున్నాయి. చాలా మంది నిపుణులు ఇండియా నుంచే వివిధ కంపెనీలకు పనిచేయాలని నిర్ణయం తీసుకుంటున్నారు. ఆయా కంపెనీలు కూడా ఇండియాలో ఆఫీసులను ప్రారంభిస్తున్నారు. అమెరికన్ కంపెనీలు ఇండియాలో పనిచేయడానికి ఉద్యోగులకు అవకాశం కల్పిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, పూణే నగరాలు ఈ మార్పును ఒడిసిపట్టుకుంటున్నాయి. అమెరికాతో పోల్చితే ఉద్యోగభద్రత, స్థిరత్వం, స్టార్టప్ కంపెనీల పెరుగుదల, ప్రపంచ స్థాయి టెక్ సంస్థలు ఇండియాలో కార్యాలయాలు ప్రారంభించడం.. ఇండియన్ నిపుణుల్లో అమెరికా పట్ల ఆసక్తి తగ్గడానికి ప్రధాన కారణం. అమెరికాలో ఇన్నాళ్లు పనిచేసిన సీనియర్ నిపుణులు ఇండియాలో సొంత స్టార్టప్ కంపెనీ ప్రారంభించడమో, లేదా వేరే కంపెనీల్లో సీనియర్ స్థాయిలో ఉద్యోగంలో చేరడమో చేస్తున్నారు. ప్రపంచ స్థాయి కంపెనీలు కూడా ఇండియాలో పనిచేస్తున్న నిపుణులకు మంచి జీతంతో పాటు అవకాశాలను కల్పిస్తున్నాయి.

ఇండియాలో మంచి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఉండటం, ఫ్లెక్సిబుల్ వర్క్ మోడల్స్, బెటర్ ఎకోసిస్టమ్, గ్లోబల్ ఎక్స్‌పోజర్, స్టార్టప్ కంపెనీలకు ప్రభుత్వాల నుంచి గట్టి మద్దతు ఉండటం.. నిపుణులకు ఇండియా మంచి ఆప్షన్ గా మారింది. ఇండియాలో ఉండి కూడా పనిచేసే అవకాశాన్ని విదేశీ కంపెనీలు కల్పిస్తున్నాయి. హెచ్ 1బీ వీసా వ్యవస్థలో ఇదే అస్థిరత కొనసాగితే .. ఆవిష్కరణల్లో అమెరికాకు ఉన్న ఎడ్జ్ ను కోల్పోయే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్టార్టప్ కంపెనీల నుంచి ఫోర్బ్స్ 500 కంపెనీల నిర్మాణం వరకు భారత నిపుణులే కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరిని కోల్పేతే అమెరికా భవిష్యత్తులో పోటీ ఇవ్వలేదు. హెచ్ 1 బీ వ్యవస్థను సులువుగా మార్చితే తప్పా అమెరికా టెక్ రంగంలో ఆధిపత్యాన్ని నిలబెట్టుకోలేదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పురపోరులోనూ కాంగ్రెస్ దే విజయం

- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **అన్నీ మున్సిపాలిటీలు హస్తాగతం చేసుకుంటాం**
- **నిజామాబాద్ లోకసభ నియోజకవర్గ నేతలతో భేటీ**

**ముద్ర, నిజామాబాద్ :**

వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ అధికారం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. అంతకు ముందు త్వరలోనే జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ గత ఎన్నికల ఫలితాలే వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా బీఆర్ఎస్, బీజేపీలకు అనుకూలంగా ఉన్న నిజామాబాద్ లోనూ ఈ సారి స్థానిక కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఆదివారం నిజామాబాద్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్, మెట్పల్లి, కోరుట్ల పురపాలక సంఘాల పార్టీ సమన్వయ సమావేశాలకు ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకా చేపట్టిన అభివృద్ధి, అమలు జరుపుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మీద విశ్వసనీయతను పెంపొందించిందని ఆయన పేర్కొన్నారు. జరిగిన అభివృద్ధిని అమలుజరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విరివిగా తీసుకపోయేందుకు కాంగ్రెస్ పార్టీ లీడర్, క్యాడర్ కృషి చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న పురపాలక సంఘం ఎన్నికల్లో సత్తా చాటాలని ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రతీ పురపాలక సంఘం మీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ నిర్వహిస్తున్న సర్వేల ఆధారంగా టికెట్లు ఖరారు చేస్తామన్నారు. సర్వేతో పాటు విధేయత,చిత్తశుద్ధి, క్రమశిక్షణ ల ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. అవకాశం రాని వారికి ప్రత్యమ్నాయ అవకాశాలు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. పార్టీ కోసం శ్రమించే ప్రతీ ఒక్కరికీ అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జరుగుతున్న అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసి పట్టణ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలన్నారు. అర్హులైన నిరుపేదలకు యావత్ భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు.



## పక్కా వ్యూహంతో జగన్..!



వైసీపీ అధినేత జగన్ ఇరవై నెలలుగా తాను తెర వెనకన ఉంటున్నారు. పార్టీని ముందు పెడుతున్నారు. ప్రతీ ఆందోళనను పార్టీ నాయకులు చేసేలా చూస్తున్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం కాకుండా ఈ మధ్యన చేసిన ఆందోళన, కోటి సంతకాల పేరుతో పార్టీలో కొంత చైతన్యం వచ్చింది. అయితే 2024లో ఓటమి తరువాత నుంచి జగన్ చేస్తున్నది, చెబుతున్నదీ ఒక్కటే. పార్టీని పటిష్టంగా ఉంచాలని. పార్టీ బాగుంటేనే అంతా బాగుంటారు అని. అందుకే ఆయన కమిటీల మీదనే ఫుల్ ఫోకస్ పెట్టేశారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ లెవెల్ నుంచి కమిటీలు వేయమని జగన్ ఆయా నియోజకవర్గ ఇంచార్జిలను కోరుతూ వస్తున్నారు.

ఈ కమిటీలు కూడా కేవలం మొత్తం అనుబంధ సంఘాలతో కలిపి వేయమంటున్నారు. అంటే మహిళ, యువత, విద్యార్థి, కార్మిక, రైతు విభాగాలు అన్న మాట. ఇలా అధ్యక్షుడు ఒకరు, ఉపాధ్యక్షులు ఇద్దరు, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రెటరీలు ఇద్దరు, కోశాధికారి ఈ విధానంలో కమిటీలు వేసుకుంటూ వెళ్తే బూత్ లెవెల్ లోనే కనీసంగా యాభై మంది దాకా క్యాడర్ కు పదవులు దక్కుతాయి, వారంతా అక్కడ పార్టీ సైన్యంగా ఉంటారు అని లెక్క వేస్తున్నారు. అక్కడ నుంచి వార్డు, అలాగే పంచాయతీ స్థాయి, మండలాలు, నియోజకవర్గాల దాకా ఈ కమిటీలు ఉంటాయి. దీంతో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసంగా 15 వేలకు తక్కువ కాకుండా జగనన్న సైన్యం తయారు అవుతుందని అంటున్నారు.

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు కనీసంగా లక్షన్నర నుంచి రెండు లక్షల మంది దాకా ఉంటారు. ఆ లెక్కన తీసుకుంటే అందులో పదో వంతుగా వైసీపీ సైన్యం ఉంటారు అన్న మాట. ప్రతీ పది మంది ఓటర్లకు ఒక వైసీపీ కమిటీ మెంబర్ అన్నట్లుగా పార్టీ అధినాయకత్వ ఈ రాజకీయ నిష్పత్తిని ఎంచుకుంది. వీరు కనీసంగా ఐదుగురిని పార్టీ వైపు మళ్లించిన లేక పార్టీ పక్షాన ఉంచుకున్నా ప్రతీ నియోజకవర్గంలో ఎనభై వేల ఓట్లుగా మారుతాయని, ఆ మీదట ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో మరి కొంత యాడ్ అవుతుందని భావిస్తున్నారు. అధినాయకత్వం చేపట్టే పాదయాత్ర వంటి వాటితో ఇంకా ఆ నంబర్ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తానికి నికరంగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష దాకా ఓట్లను ఉంచుకోగలిగితే ఎన్నికల్లో ఎదురు ఉండదని వైసీపీ పక్కా ప్లాన్ తోనే కమిటీల మీద ఫుల్ ఫోకస్ పెడుతోంది అని అంటున్నారు.

తాజాగా విజయనగరంలో జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ జగన్ విజన్ని ప్రతీ వారూ తెలుసుకోవాలనలన్నారు. పార్టీకి లాభం కలగాలని పార్టీ గెలవాలని ఆయన కమిటీలను ఏర్పాటు చేయమని గట్టిగా కోరుతున్నారని తెలిపారు. జగన్ మాట వింటే పార్టీకి తిరుగు ఉండదని స్వామి చెప్పడం విశేషం. ప్రతీ నియోజకవర్గంలో జగనన్న సైన్యం పెద్ద ఎత్తున తయారు చేయమని అధినేత కోరుతున్నారని ఆయన చెప్పారు. అంతా కష్టపడి కమిటీలను వేయాలని ఇక బూత్ లెవెల్ దాకా పార్టీని తీసుకుని వెళ్తే కనుక కచ్చితంగా మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు.

మరో వైపు భీమిలీలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వైసీపీ ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కమిటీలు అన్నీ పూర్తి అయిన తరువాత క్యాడర్ ను తప్పకుండా గుర్తుంచుకుంటామని చెప్పారు. అంతే కాకుండా వారికే అన్ని విధాలుగా పెద్దపీట వేస్తామని తెలిపారు. ఇక కార్యకర్తలు అందరికీ ఐడెంటిటీ కార్డుతో పాటు ఇన్సూరెన్స్ కూడా చేయిస్తామని ఆయన చెప్పారు. అధినాయకత్వం క్యాడర్ కే అగ్ర తాంబూలం అని చెబుతోందని, అందువల్ల పార్టీ అధికారంలోకి వస్తే క్యాడరే లీడర్ అని వైసీపీ నేతలు చెబుతున్నారు.

**-కనపర్తి రవి**

## పట్టణాల్లో కొరవడిన ఓటు చైతన్యం

- **ఓటు హక్కు వినియోగించుకుంటున్న90 శాతం పల్లె ఓటర్లు**
- **క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**ముద్ర, మక్తల్:**

గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే, పట్టణాల్లో ఓటరు చైతన్యం కొరవడిందని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మక్తల్ పట్టణంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మినీ స్టేడియం నుంచి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఓటు విలువపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులు, యువత "మన ఓటు - మన హక్కు" అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ప్రతి పోలింగ్ బూత్‌లో 70 నుంచి 90 శాతం వరకు ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. అదే ఉత్సాహాన్ని పట్టణాల్లో నివసిస్తున్న విద్యావంతులు చూపడం లేదన్నారు. రాజ్యాంగం మనకు ఇచ్చిన ముఖ్యమైన హక్కుల్లో ఓటు హక్కు ఒకటన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించే శక్తి ఓటర్ల చేతుల్లోనే ఉందని మంత్రి గుర్తు చేశారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్, మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, కోళ వెంకటేష్, కట్టా సురేష్, రవికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## ఇసుకను దోచుకున్న కేటీఆర్, హరీష్ రావు

- **మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

కేటీఆర్ సిరిసిల్ల, హరీష్ రావు కొంగోడు, సర్దన నుంచి వేల కోట్ల రూపాయల ఇసుకను దోచుకున్నారని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు ఆరోపించారు. ఆదివారం మెదక్ సొసైటీ మాజీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ చింతల నర్సింలు, మాజీ వైస్ చైర్మన్ ఉప్పల కిష్టయ్య తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ కోనాపూర్ సొసైటీని దోచుకున్నారన్నారు. రాబోయే రోజుల్లో అన్ని కుంభకోణాలు బయటకు తీస్తామని హెచ్చరించారు. మెదక్ ను అభివృద్ధి చేయాలంటే ఇక్కడి నుంచి సిద్దిపేటకు తరలించిన కార్యాలయాలను తిరిగి తీసుకురావాలని హరీష్ రావును డిమాండ్ చేశారు. వర్షాకాలంలో వరదలు వచ్చి విపరీతమైన నష్టం జరిగినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ వచ్చి పంట నష్టంపై రివ్యూ చేశారని గుర్తు చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా వరదలు వచ్చినప్పుడు ఇలా స్పందించలేదన్నారు. ఏడుపాయలకు వచ్చిన దాఖలాలు లేవన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడుపాయలకు వచ్చి అమ్మవారిని దర్శించుకుని రూ.30 కోట్ల నిధులు ఇచ్చారన్నారు. ఏడుపాయలను ఊహించని విధంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మెదక్ చర్చికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సందర్శించి 29. 30 కోట్ల రూపాయలను మంజూరు చేశారన్నారు.

మెదక్ అభివృద్ధి విషయంలో ఎట్టి పరిస్థితిలో వెనుకకు పోమన్నారు. మెదక్ నియోజకవర్గానికి మైనంపల్లి రోహిత్ రావు ఎమ్మెల్యే అయిన తర్వాత 200కోట్లు తెచ్చి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. మెదక్, రామాయంపేటలో మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో సీనియర్లకు అవకాశం రాకపోతే దగ్గరుండి నామినేటెడ్ పదవులు, జీతం వచ్చే పదవులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, రాగి అశోక్, అఫ్జల్, మ్యాడం బాలకృష్ణ, మహిపాల్ రెడ్డి, అరుణార్తి వెంకటరమణ, మేడి మధుసూదన్ రావు, హఫీజుద్దీన్, పరుశురాం గౌడ్, బొజ్జ పవన్, ఉప్పల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి హామీని అమలు చేస్తున్నాం

- **ఏపీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

**ముద్ర, నంద్యాల:**

.ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ లో భాగంగా ప్రతి హామీని అమలు చేస్తున్నామని ఏపీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఆదివారం నంద్యాలలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన టీడీపీ పార్లమెంటరీ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అథితులుగా మంత్రులు ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి హాజరయ్యారు .

నూతన జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికైన గౌరు చరిత రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ లను లభినందించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలకు అండగా నిలవాల్సిన బాధ్యత నూతన కార్యవర్గంపై ఉందని సూచించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సమన్వయంతో సాగుతోందన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి పాలన అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రజలు కూటమి కి భారీ మెజార్టీ ఇవ్వడంతో మన బాధ్యత మరింత పెరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నేతలు అంతా ఒక్కటే సత్తా చాటాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు స్థాయికి మించి విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్లు వైసీపీ చేసిన పాపాలు నేడు వారి పాలిట శాపాలుగా మారుతున్నాయన్నారు. గతంలో వారు వేధింపులకు పాల్పడితే మనం ప్రజాస్వామ్యబద్ధంగా పాలన చేస్తున్నామన్నారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తే మీ సంగతి చూస్తామంటూ వైసీపీ నేతలు బెదిరిండం తగదన్నారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కని వైసీపీ నేతలకు మాట్లాడే అర్హత లేదన్నారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రావాలని సూచించారు. రాయలసీమను అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ను గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు.



## రాష్ట్రాభివృద్ధిలో ఎంపీల పాత్ర కీలకం

- **టీడీపీ ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం**

**ముద్ర, అమరావతి :**

రాష్ట్రాభివృద్ధిలో ఎంపీల భాగస్వామ్యం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కేంద్ర నిధులను సమర్థంగా రాబట్టి పార్లమెంట్ నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని టీడీపీ ఎంపీలకు సూచించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ సమావేశంలో బడ్జెట్ సెషన్‌లో ప్రస్తావించాల్సిన అంశాలు, కేంద్రంతో జరపాల్సిన సంప్రదింపులపై దిశానిర్దేశం చేశారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజ్, పూర్వోదయ పథకం, పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టులను ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. బడ్జెట్ సెషన్‌లోనే అమరావతిని రాజధానిగా చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశ పెట్టనున్నట్టు వెల్లడించారు. ఈ అంశంపై కేంద్ర మంత్రులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. రాష్ట్ర అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ఫిబ్రవరిలో జరిగే జిల్లాల కలెక్టర్ల సదస్సుకు ఎంపీలందరూ వర్చువల్‌గా హాజరవ్వాలని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.01.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మంగోల్ ఆక్రమణలు (13వ శతాబ్దం)**

చెంగీజ్ ఖాన్ నేతృత్వంలో జరిగిన దండయాత్రలు నగరాలను ధ్వంసం చేశాయి. చరిత్రకారుల అంచనా ప్రకారం 4 కోట్లకు పైగా మృతి.





# ప్రమాదం.. విషాదం

- **నాంపల్లి అగ్నిప్రమాదంలో ఐదుగురి సజీవ దహనం**
- **మృతుల్లో ఇద్దరు చిన్నారులు**
- **ఫర్నీచర్ షాపు ఓనర్ సతీష్ బచా అరెస్ట్**
- **మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్ గ్రేషియా**

**ముద్ర, హైదరాబాద్ :**

నాంపల్లి స్టేషన్ రోడ్డులో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం నగరాన్ని విషాదంలో ముంచింది. ఫర్నీచర్ షాపులో చెలరేగిన మంటలు నాలుగు అంతస్తులకు వ్యాపించి ఐదుగురు సజీవ దహనమయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉండటం హృదయ విదారకంగా మారింది.

**22 గంటల రెస్క్యూ..**

ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక, రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయి. దట్టమైన పొగల కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడగా, 22 గంటల పాటు శ్రమించిన తర్వాత మృతుల సంఖ్యపై స్పష్టత వచ్చింది. పలువురిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.

**మృతుల వివరాలు..**

అఖిల్ (7), ప్రణీత్ (11), హాబీబ్ (35), ఇంతియాజ్ (32), బేబీ (43) ఈ ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**ప్రముఖుల సంతాపం..**

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అగ్ని ప్రమాదంపై పలువురు రాజకీయ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అగ్నిప్రమాదం అత్యంత దురదృష్టకరమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ ఘటనలో ఐదుగురు అమాయకులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదం పై హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**యజమాని అరెస్ట్..**

ప్రాథమిక విచారణలో షాపు యజమాని నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని తేలింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా సెల్లార్‌లో వ్యాపారం నిర్వహించడంతో ఫర్నీచర్ షాపు ఓనర్ సతీష్ బచాను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్

- **సైబరాబాద్‌లో 296 మందిపై కేసులు**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 296 మందిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. పట్టుబడ్డ వారిలో 231 ద్విచక్ర వాహనదారులు, 17 ఆటో డ్రైవర్లు, 47 కార్ల డ్రైవర్లు, ఒక హెవీ వాహన డ్రైవర్ ఉన్నారు. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్ (బీఏసీ) ఆధారంగా కేసులను వర్గీకరించగా... 100 ఎంఎల్‌కు 100 నుంచి 200 ఎంజీ మధ్య 259 మంది, 201 నుంచి 300 ఎంజీ మధ్య 26 మంది, 301 నుంచి 550 ఎంజీ మధ్య 11 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపరుస్తామని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు మరోసారి హెచ్చరించారు. గత వారం రోజుల్లో 215 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించగా... ఐదుగురికి జైలు శిక్షతో పాటు జరిమానా, ఎనిమిది మందికి జరిమానా మరియు సోషల్ సర్వీస్, 202 మందికి కేవలం జరిమానా విధించినట్లు అధికారులు వివరించారు.



# జర్నలిస్టుల హక్కులకై నిరంతర పోరాటం

- **టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్**

**ముద్ర, వనపర్తి :**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం జర్నలిస్టుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ స్పష్టం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో జరిగిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రెండో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐజేయూ పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం జీవో 252ను విడుదల చేసిందని, జర్నలిస్టులకు మేలు చేసేలా అందులో సవరణలు చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. త్వరలో సవరించిన జీవో విడుదల అవుతుందని చెప్పారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు అందే విధంగా యూనియన్ కృషి చేస్తుందని, ఎవరూ అపోహలకు గురి కావద్దని సూచించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం కేటాయించిన 10 గుంటల స్థలంలో జర్నలిస్టు భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి భవన నిర్మాణం జరిగేలా కృషి చేస్తామని అన్నారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహించామని, త్వరలో పెబ్బేరులో కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం మంజూరు చేసే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. ఘణపురం, చిన్నంబావి, వనపర్తి ప్రాంతాల్లో జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలు అందేలా ఉద్యమిస్తామని, అవసరమైతే ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన మల్యాల బాలస్వామిని, సీనియర్ జర్నలిస్టు గోపాల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రాజు, కోశాధికారి ధ్యారపోగు మన్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఫెడరల్ కాల్పులతో అమెరికాలో కల్లోలం

- **నర్సు మృతి కేసులో దేశవ్యాప్తంగా ఆగ్రహం**

**ముద్ర, వాషింగ్టన్ :**



మిన్నియాపోలిస్‌కు చెందిన 37 ఏళ్ల ఐసీయూ నర్సు, అమెరికన్ పౌరుడు అలెక్స్ జెఫ్రీ ప్రెట్టీ ఫెడరల్ ఏజెంట్ల కాల్పుల్లో మృతి చెందడం అమెరికాలో తీవ్ర కలకలం రేపింది. ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు నిర్వహించిన ఆపరేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒక సామాన్య పౌరుడి మృతి ప్రజాస్వామ్య విలువలపైనే ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**అధికారుల వాదన.. కుటుంబం ఖండన**

అలెక్స్ వద్ద ఆయుధం ఉండడంతో అధికారులపై దాడికి యత్నించాడని, ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరపాల్సి వచ్చిందని ఐసీఈ అధికారులు చెబుతున్నారు. అయితే అలెక్స్‌కు ఎలాంటి క్రిమినల్ రికార్డు లేదని, చట్టబద్ధమైన గన్ లైసెన్స్ ఉన్నప్పటికీ అధికారులపై దాడి చేసే వ్యక్తి కాదని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారుల వాదనలపై అనుమానాలు పెరిగాయి.

**వరుస ఘటనలతో ప్రజల్లో భయం**

గత మూడు వారాల్లో ఇదే రెండో ఫెడరల్ కాల్పుల ఘటన కావడంతో మిన్నియాపోలిస్‌లో ఉద్రిక్తతలు పెరిగాయి. ఇటీవల రెనీ నికోల్ గుడ్ అనే మహిళ కూడా ఇలాంటి ఘటనలో మృతి చెందారు. వరుస ఘటనలతో ఫెడరల్ ఏజెంట్ల పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. వేలాది మంది రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టడంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.



# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణం

- **డీఆర్‌వో మంగీలాల్**

ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన వజ్రాయుధమని జిల్లా రెవెన్యూ అధికారి మంగీలాల్ అన్నారు. 18ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఓటర్లతో ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంగీలాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే ప్రధాన ఆయుధం ఓటేనని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు పూర్తైన ఎనిమిది మందికి ఎపిక్ కార్డులు అందజేశారు. అలాగే 85 ఏళ్లుగా నిరంతరం ఓటు హక్కు వినియోగిస్తున్న ఐదుగురు సీనియర్ సిటిజన్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వీప్ అధికారి సత్తార్, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యాధికారి స్వర్ణకుమారి, జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నేమత్ అలీతోపాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు

# వైద్యసేవకు ప్రశంస ఏదీ?




- **గణతంత్ర దినోత్సవ పురస్కారాల్లో అనర్హుల ఎంపికపై తీవ్ర విమర్శలు**

**ముద్ర, నారాయణపేట ప్రతినిధి :**

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖలో ఇచ్చే ప్రశంసలు, పురస్కారాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్ర స్థాయిలో నిరంతరం సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బందిని పక్కనబెట్టి, కొందరికే ప్రత్యేకంగా ప్రశంసలు దక్కుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రశంసలకు తీసుకునే ప్రమాణాలు ఏమిటన్నది స్పష్టత లేకపోవడంతో శాఖ పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిజమైన సేవలకు గుర్తింపు లేకపోతే ఉద్యోగుల్లో నిరుత్సాహం పెరుగుతుందని, స్పష్టమైన ప్రమాణాలతోనే పురస్కారాలు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

**వివాదాస్పద వైద్యుడికి ప్రాధాన్యం... ద్వంద్వ వైఖరిపై ఆరోపణలు**

నారాయణపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఓ వైద్యుడు అనధికారిక వ్యక్తితో కలిసి సేవలందిస్తున్నట్లు గతంలో వార్తలు వచ్చినప్పటికీ, అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారి తీసింది. ఈ వ్యవహారానికి జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ఒక కింది స్థాయి అధికారి అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో మక్తల్ ప్రాంతానికి చెందిన మరో వైద్యుడిపై విధులకు గైర్హాజరయ్యాడన్న కారణంతో ఒక్కరోజు జీతం నిలిపివేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనంగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పునర్విచారణ కోరుతున్న వైద్య వర్గాలు**

వివాదాలకు కేంద్రంగా ఉన్న వైద్యుడినే ప్రశంస పత్రానికి ఎంపిక చేయడంలోనూ అదే అధికారి కీలకపాత్ర పోషించాడన్న సమాచారం కలకలం రేపుతోంది. ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్‌సీడీ సేవలు బలహీనంగా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. ఇలాంటి వారిని ప్రోత్సహించడం ద్వారా నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న వైద్యులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆవేదన వ్యక్తమవుతోంది. జిల్లా స్థాయి అధికారులు ఇప్పటికైనా ఈ వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటే, వైద్య సిబ్బందిలో నమ్మకం పెరుగుతుందని, ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం అవుతుందని పలువురు సూచిస్తున్నారు.

# కార్మికుడి మృతిపై హెచ్‌ఆర్‌సీ సీరియస్

- **జీహెచ్‌ఎంసీ కమిషనర్ కు నోటీస్**

**ముద్ర, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ర్యాంప్, కంపాక్టర్ యంత్రంలో పడి పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా స్పందించింది. ఆదివారం ప్రముఖ దినపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కమిషన్ చైర్మన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించారు. కార్మికుడి మృతికి సరైన భద్రతా చర్యలు లేకపోవడం, సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని కమిషన్ ప్రాథమికంగా అభిప్రాయపడింది. పని ప్రదేశంలో కనీస రక్షణ కల్పించకపోవడం కార్మికుల జీవించే హక్కు, మానవ గౌరవం, సురక్షిత పని పరిస్థితుల ఉల్లంఘనకిందకు వస్తుందని స్పష్టం చేసింది. ఈ ఘటనపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపి వచ్చే నెల 23లోపు వాస్తవాలతో కూడిన సమగ్ర నివేదికను సమర్పించాలని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ కర్ణన్‌కు నోటీస్ జారీ చేసింది.

# విద్యతోపాటు నైతిక విలువలు అవసరం

- **మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**




చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరులో ఉన్న శ్రీ శివసాయి ఇంటర్నేషనల్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యా సంస్థ నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. విద్య జీవితానికి పునాది వంటిదని, మంచి విలువలతో ఎదిగితేనే భవిష్యత్తు సుస్థిరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
26.01.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఇరాన్–ఇరాక్ యుద్ధం (1980–1988)

మధ్యప్రాచ్యాన్ని కుదిపేసిన ఈ యుద్ధంలో రసాయన ఆయుధాలు కూడా వాడారు. 10 లక్షల వరకు ప్రాణనష్టం.



# తొందరపాటే సంజూశాంసన్ కొంపముంచుతోంది..



**టీమిండియా మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
టీమిండియా వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్ సంజూ శాంసన్ ఆటలో చూపిస్తున్న తొందరపాటు అతనికే నష్టంగా మారుతుందని మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. క్రీజులో కాస్త సమయం తీసుకుని ఆడాలని, సెట్ అయ్యే వరకు అభిషేక్ శర్మకు స్ట్రైక్ ఇచ్చి సింగిల్స్‌తో లయ అందుకోవాలని సూచించాడు.
న్యూజిలాండ్‌తో జరిగిన తొలి రెండు టీ20ల్లో సంజూ (10, 6) నిరాశపరిచాడు. దూకుడుగా ఆడే క్రమంలో సరైన ఎంపిక లేని షాట్లు ఆడి వికెట్ కోల్పోయాడు. ఈ ప్రదర్శనతో అతనిపై ఒత్తిడి పెరిగిందని శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్‌లో వ్యాఖ్యానించాడు. అదే సమయంలో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ఇషాన్ కిషన్ ధాటిగా ఆడటం సంజూ పరిస్థితిని మరింత క్లిష్టం చేసిందని తెలిపాడు.
తిలక్ వర్మ తిరిగి జట్టులోకి వస్తే ఇషాన్ కిషన్, సంజూ శాంసన్‌లలో ఒకరిని తప్పించాల్సి వస్తుందని శ్రీకాంత్ స్పష్టం చేశాడు. రెండో టీ20లో సంజూ తొలి బంతుల్లోనే ప్రమాదం నుంచి తప్పించుకున్నప్పటికీ, వెంటనే మరో చెత్త షాట్‌కు ఔటయ్యాడని గుర్తు చేశాడు. అలాంటి వేళ ఎదురుదాడి కంటే స్ట్రైక్ రొటేషన్ ముఖ్యం అని పేర్కొన్నాడు. జట్టులో పోటీ తీవ్రంగా ఉందని, సూర్యకుమార్ యాదవ్ కూడా ఫామ్‌లోకి వస్తున్నాడని చెప్పాడు.
ఈ నేపథ్యంలో న్యూజిలాండ్‌తో మూడో టీ20లో సంజూ శాంసన్‌కు అవకాశం దక్కుతుందా అన్న సందేహాలు తలెత్తాయి. మేనేజ్‌మెంట్ మద్దతు లభిస్తే బరిలోకి దిగే అవకాశం ఉన్నా, ఆ మ్యాచ్‌లో తప్పక రాణించాల్సిన పరిస్థితి నెలకొందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## చాహల్‌పై ఆర్జే మహ్వాష్ క్రిప్టిక్ వ్యాఖ్యలు...
# సోషల్ మీడియాలో కలకలం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌ను ఉద్దేశిస్తూ కంటెంట్ క్రియేటర్ ఆర్జే మహ్వాష్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీశాయి. పేరు చెప్పకపోయినా... 'మోసగాడు, ఎవ్వరూ నమ్మొద్దు' అంటూ ఆమె చేసిన పోస్టులు చాహల్‌నే లక్ష్యంగా పెట్టుకున్నవని నెటిజన్లు భావిస్తున్నారు. చాహల్, ఆర్జే మహ్వాష్ మధ్య డేటింగ్ వార్తలు గతంలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. అధికారికంగా ఇద్దరూ స్పందించకపోయినా, కలిసి పార్టీలకు హాజరవడం, బహిరంగంగా కనిపించడం వల్ల ఈ ఊహాగానాలు బలపడ్డాయి. ధనశ్రీ వర్మతో విడాకుల అనంతరం వీరి సాన్నిహిత్యం మరింత పెరిగిందన్న ప్రచారం కూడా జరిగింది.
అయితే తాజాగా ఇద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం గమనార్హంగా మారింది. ఇదే సమయంలో చాహల్ బిగ్‌బాస్ ఫేమ్ షెఫాలి బగ్గతో డిన్నర్‌కు వెళ్లిన ఫొటోలు వైరల్ కావడంతో, కొత్తకోణంలో చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో ఆర్జే మహ్వాష్ షేర్ చేసిన వీడియో సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది. "ఇతరులను మార్చాలనే అలవాటు మానేశాను. నువ్వు నీచంగా ప్రవర్తించావు. నా జీవితం నుంచి వెళ్లిపో" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు చాహల్‌కే సంకేతమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఆమె ఉద్దేశంపై స్పష్టత లేదు. ఇక చాహల్ వ్యక్తిగత జీవితంలో విడాకుల తర్వాత మానసిక ఒత్తిడి ఎదుర్కొన్నట్లు గతంలో వెల్లడించాడు. ప్రస్తుతం టీమిండియా జట్టుకు దూరంగా ఉన్న దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌కే పరిమితమయ్యాడు.



## ప్రపంచకప్‌కు ముందు భారత్–సౌతాఫ్రికా
# హై వోల్టేజ్ వార్మప్ మ్యాచ్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
టీ20 ప్రపంచకప్‌కు ముందు డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా, గతేడాది రన్నరప్ దక్షిణాఫ్రికాతో తలపడనుంది. అయితే ఈ పోరు రెగ్యులర్ మ్యాచ్‌గా కాకుండా వార్మప్ మ్యాచ్‌గా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ప్రపంచకప్‌కు ముందు ఇరు జట్లకు ఇదొక్కటే వార్మప్ మ్యాచ్ కావడం విశేషం.
సాధారణంగా ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలకు ముందు అనేక వార్మప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. కానీ ఈసారి బంగ్లాదేశ్ జట్టు పాల్గొనకపోవడంతో షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్ ప్రపంచకప్‌లో ఆడనుండటంతో ఫైనల్ షెడ్యూల్ ఆలస్యమైంది.
భారత్-సౌతాఫ్రికా మధ్య జరగనున్న ఈ వార్మప్ మ్యాచ్‌పై ఐసీసీ నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, బీసీసీఐతో పాటు క్రికెట్ సౌతాఫ్రికా ఈ విషయాన్ని ధృవీకరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, భారత జట్టు ప్రస్తుతం స్వదేశంలో న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో పాల్గొంటోంది. ఈ సిరీస్‌లో చివరి మ్యాచ్ జనవరి 31న తిరువనంతపురంలో జరగనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 3న టీమిండియా ముంబై చేరుకోనుంది. సౌతాఫ్రికాతో వార్మప్ మ్యాచ్ ఫిబ్రవరి 4న ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగే అవకాశముందని తెలుస్తోంది.
టీ20 ప్రపంచకప్ ప్రధాన షెడ్యూల్ ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానుంది. కొలంబో వేదికగా జరిగే పాకిస్తాన్-నెదర్లాండ్స్ మ్యాచ్‌తో టోర్నీకి తెరలేవనుంది. అదే రోజు భారత్ తమ తొలి మ్యాచ్‌ను ముంబైలోని వాంఖడే స్టేడియంలో యూఎస్ఏతో ఆడనుంది. గ్రూప్-ఏలో భారత్‌తో పాటు యూఎస్ఏ, పాకిస్తాన్, నెదర్లాండ్స్, నమీబియా జట్లు ఉన్నాయి. భారత్ గ్రూప్ మ్యాచ్‌లు ఫిబ్రవరి 12న ఢిల్లీలో నమీబియాతో, 15న కొలంబోలో పాకిస్తాన్‌తో, 18న అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో జరగనున్నాయి. ఇక దక్షిణాఫ్రికా జట్టు కెనడా, ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్, యూఏఈలతో కలిసి గ్రూప్-డిలో ఉంది. దక్షిణాఫ్రికా తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 9న అహ్మదాబాద్‌లో కెనడాతో ఆడనుంది.



# మాజీ క్రికెటర్ పై లైంగిక వేధింపుల ఆరోపణలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
పాకిస్తాన్ క్రికెట్‌లో షాక్ కలిగించే వార్త. మాజీ దేశీయ క్రికెటర్ సులేమాన్ ఖాదిర్ పై తన పనిమనిషిని బలవంతంగా వేధించాడని లైంగిక దాడి ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన లాహోర్‌లో చోటు చేసుకున్నట్లు తెలియవచ్చింది. ఫిర్యాదు రాకనే వెంటనే పోలీసులు సులేమాన్ ఖాదిర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలిని వైద్య పరీక్షలకు పంపగా, ఫలితాలు దాడి జరిగిందో లేదో నిర్ధారించనున్నాయి. కేసు ప్రస్తుతం దర్యాప్తు కింద ఉంది.
41 ఏళ్ల సులేమాన్ ఖాదిర్ 2005-2013 మధ్య పాకిస్తాన్ దేశీయ క్రికెట్‌లో పాల్గొన్నాడు. లాహోర్‌లో ఖాదిర్ క్రికెట్ అకాడమీని కూడా నడుపుతున్నాడు.
తండ్రి అబ్దుల్ ఖాదిర్ పాకిస్తాన్ క్రికెట్‌లో లెజెండ్. 67 టెస్టులు, 104 వన్డేలలో 236 టెస్టు, 132 వన్డే వికెట్లు సాధించాడు. 2019లో ఆయన మరణించారు. సులేమాన్ సోదరుడు ఉస్మాన్ ఖాదిర్ కూడా పాకిస్తాన్ తరపున అంతర్జాతీయ క్రికెట్ ఆడాడు. ప్రస్తుతం ఉస్మాన్ క్రికెట్ నుంచి రిటైర్ అయి ఆస్ట్రేలియాలో క్లబ్ క్రికెట్ ఆడుతున్నారు. దర్యాప్తు ముగిసేవరకు సులేమాన్ ఖాదిర్ హుజూరైనట్లు అధికారులు తెలిపారు.



# చరిత్ర సృష్టించిన జో రూట్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ మరో అరుదైన రికార్డుతో వార్తల్లో నిలిచాడు. శ్రీలంకతో జరిగిన రెండో వన్డేలో అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన రూట్... ఇంగ్లండ్ తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక POTM అవార్డులు సాధించిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఈ మ్యాచ్‌లో రూట్ బ్యాటింగ్‌లో 90 బంతుల్లో 72 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి, ఫీల్డింగ్‌లో క్యాచ్‌తో జట్టు విజయంలో భాగమయ్యాడు. మొత్తంగా 383 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 27 POTM అవార్డులు అందుకున్న రూట్... కెవిన్ పీటర్సన్ (26) రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో బట్లర్, ఇయాన్ మోర్గాన్ తదుపరి స్థానాల్లో ఉన్నారు.

**ఇంగ్లండ్ విజయం**
రూట్ నాయకత్వంలో ఇంగ్లండ్ రెండో వన్డేలో శ్రీలంకపై ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ 11తో సమమైంది.

**శ్రీలంక ఇన్నింగ్స్**
ఇంగ్లండ్ బౌలర్లు సమిష్టిగా రాణించడంతో శ్రీలంక 49.3 ఓవర్లలో 219 పరుగులకే ఆలౌటైంది. ఓవర్టన్, ఆదిల్ రషీద్, రూట్ తలో రెండు వికెట్లు తీశారు. ధనంజయ డిసిల్వ, అసలంక మాత్రమే కొంత పోరాటం చేశారు.

**లక్ష్య ఛేదన**
220 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్... రూట్, హ్యారీ బ్రూక్, డకెట్, బట్లర్‌ల సహకారంతో లక్ష్యాన్ని సులభంగా ఛేదించింది. ఇకపై మూడో వన్డే జనవరి 27న కొలంబోలో జరగనుంది. అనంతరం పల్లెకెలె వేదికగా టీ20 సిరీస్ నిర్వహించనున్నారు.

# ఐసీసీపై అఫ్రిది ఫైర్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకోవడంపై పాకిస్థాన్ మాజీ ఆటగాడు షాహిద్ అఫ్రిది ఐసీసీ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ఐసీసీ ద్వంద్వ నీతితో వ్యవహరిస్తోందని, సభ్య దేశాల పట్ల సమాన వైఖరి చూపడం లేదని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన అఫ్రిది, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా భారత్ డిమాండ్లను ఐసీసీ వెంటనే అంగీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. భద్రతా కారణాలతో భారత్ పాకిస్థాన్‌కు రాలేదని చెప్పగానే మ్యాచ్‌లను దుబాయ్‌కు మార్చారని, అదే సానుకూలతను బంగ్లాదేశ్ విషయంలో ఎందుకు చూపలేదని ప్రశ్నించారు.
భద్రతా కారణాలు చూపుతూ భారత్‌కు జట్టును పంపేందుకు బంగ్లాదేశ్ నిరాకరించగా, ఐసీసీ షెడ్యూల్ మార్పును అంగీకరించలేదు. దాంతో బంగ్లాదేశ్ టోర్నీ నుంచి తప్పుకుంది. వారి స్థానంలో స్కాట్లాండ్‌ను చేర్చినట్లు ఐసీసీ ప్రకటించింది. అన్ని దేశాలను ఒకేలా చూడాల్సిందేనని, నిష్పక్షపాతమే క్రికెట్‌కు పునాదని అఫ్రిది స్పష్టం చేశారు.



# టెస్ట్ జట్టులో ప్రతీకకు అవకాశం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
వన్డే ప్రపంచకప్ విజేత జట్టులో కీలక సభ్యురాలిగా నిలిచిన ప్రతీక రావల్‌కు తొలిసారి భారత టెస్టు జట్టులో చోటు దక్కింది. ఆస్ట్రేలియాతో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్ కోసం ఎంపిక చేసిన జట్టులో ప్రతీకతో పాటు లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ, మీడియం పేసర్ క్రాంతి గౌడ్‌లు కూడా తొలిసారి చోటు సంపాదించారు.
మార్చి 6 నుంచి పెర్త్ వేదికగా జరిగే ఈ టెస్టు కోసం సెలెక్షన్ కమిటీ శనివారం 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో భారత మహిళల జట్టు ఈ ఆస్ట్రేలియా పర్యటనలో మూడు టి20లు, మూడు వన్డేలు, ఒక టెస్టు మ్యాచ్ ఆడనుంది. పరిమిత ఓవర్ల జట్లను ఇప్పటికే ప్రకటించిన సెలెక్టర్లు తాజాగా టెస్టు జట్టును వెల్లడించారు.
వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్‌కు ముందు గాయంతో జట్టుకు దూరమైన ప్రతీక రావల్ ప్రస్తుతం పూర్తిగా కోలుకుని మళ్లీ జాతీయ జట్టులోకి ఎంపిక కావడం విశేషం. అండర్-19 ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందిన వైష్ణవి శర్మకు సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ అవకాశం దక్కింది.
ఇక వన్డే, టి20 సిరీస్‌లకు ఎంపికైన వికెట్ కీపర్ కమలినికి గాయం కారణంగా ఆమె స్థానంలో ఉమా ఛెత్రీని టెస్టు జట్టులోకి తీసుకున్నారు.



**భారత మహిళల టెస్టు జట్టు:**
హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, అమన్‌జ్యోత్ కౌర్, రిచా ఘోష్, ఉమా ఛెత్రీ, ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, రేణుక ఠాకూర్, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, వైష్ణవి శర్మ, సయాలి సత్‌గరే.

# బీబీఎల్ విజేతగా పెర్త్ స్కార్చర్స్

- **ఫైనల్‌లో సిడ్నీ సిక్సర్‌పై 6 వికెట్ల ఆధిపత్య విజయం**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
బిగ్ బాష్ లీగ్ (BBL 2025-26) సీజన్‌లో పెర్త్ స్కార్చర్స్ మరోసారి చాంపియన్‌గా నిలిచి తన సత్తాను నిరూపించింది. ఫైనల్ పోరులో సిడ్నీ సిక్సర్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. బీబీఎల్ చరిత్రలో పెర్త్ స్కార్చర్స్‌కు ఇది ఆరో ట్రోఫీ కావడం విశేషం. ఇప్పటివరకు ఏ జట్టూ ఈ స్థాయిలో విజయాలు నమోదు చేయలేదు. ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సిడ్నీ సిక్సర్ నిర్ణీత 20 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. జోష్ ఫిలిప్, స్టీవ్ స్మిత్, మోయిసెస్ హెన్రిక్స్ తలా 24 పరుగులు చేసి జట్టుకు కొంత పోరాటం అందించారు. జోయెల్ డేవిస్ 19, లచ్లాన్ షా 14 పరుగులు చేశారు. పెర్త్ బౌలర్లలో డేవిడ్ పేన్ 18 పరుగులిచ్చి 3 వికెట్లు, జే రిచర్డ్‌సన్ 32 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. 133 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పెర్త్ స్కార్చర్స్ 17.3 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. మిచెల్ మార్ష్ 43 బంతుల్లో 44 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడగా, ఫిన్ అలెన్ 22 బంతుల్లో 36 పరుగులు చేసి వేగవంతమైన ఆరంభం అందించాడు. చివర్లో జోష్ ఇంగ్లిస్ 26 బంతుల్లో అజేయంగా 29 పరుగులు చేసి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. ఈ గెలుపుతో పెర్త్ స్కార్చర్స్ బిగ్ బాష్ లీగ్‌లో మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుతూ అభిమానులను ఉర్రూతలూగించింది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.01.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తైపింగ్ తిరుగుబాటు (1850–1864)**
చైనాలో జరిగిన ఈ అంతర్గత యుద్ధం చరిత్రలోనే అత్యంత రక్తపాతం. 2–3 కోట్ల మంది మరణం.



## ఒక్కడులో ఓబుల్ రెడ్డి పాత్ర వెనుక కథ

**ప్రకాష్ రాజ్ ఫిక్స్ కావడానికి కారణాలు వెల్లడి**

మహేష్ బాబు హీరోగా గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘ఒక్కడు’ సినిమా అప్పట్లో భారీ విజయం సాధించింది. పరిశ్రమలో ఉన్న పలు రికార్డులను బద్దలు కొట్టిన ఈ చిత్రం, మహేష్ బాబు కెరీర్‌లో తొలి కమర్షియల్ సక్సెస్‌గా నిలిచింది. మాస్ ప్రేక్షకుల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన సినిమాగా ‘ఒక్కడు’కు ఇప్పటికీ ప్రత్యేక స్థానం ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను దర్శకుడు గుణశేఖర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఓబుల్ రెడ్డి పాత్ర కోసం మొదట ప్రకాష్ రాజ్‌ను ఎంపిక చేసినప్పటికీ, అప్పట్లో ఫిలిం ఛాంబర్ స్థాయిలో ఆయనపై కొంత వ్యతిరేకత వ్యక్తమైందని చెప్పారు. ఆ నేపథ్యంలో నిర్మాత ఎమ్మెస్ రాజుతో కలిసి మరో నటుడిని తీసుకోవాలనే ఆలోచన చేశారన్నారు.

ఆ సమయంలో ‘జయం’ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న గోపీచంద్‌ను విలన్ పాత్ర కోసం సంప్రదించి చర్చలు కూడా జరిపినట్లు తెలిపారు. ఈ విషయం తెలిసిన తర్వాత ప్రకాష్ రాజ్ నేరుగా గుణశేఖర్‌ను కలసి, ఓబుల్ రెడ్డి పాత్రను తానే చేయాలని స్పష్టంగా చెప్పారన్నారు. ఆ పాత్రకు తానే ఫిక్స్ అయ్యానని, మరెవరు చేసినా ఒప్పుకోనని కఠినంగా చెప్పినట్లు వివరించారు. తరువాత ఫిలిం ఛాంబర్‌లో ఉన్న సమస్యలను ప్రకాష్ రాజ్ క్లియర్ చేసుకొని సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని గుణశేఖర్ తెలిపారు. ఫలితంగా ఓబుల్ రెడ్డి పాత్రకు ఆయన ఎంపిక ఖరారైంది. ఈ పాత్రకు ప్రకాష్ రాజ్ ఇచ్చిన ఇంపాక్ట్ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిందన్నది సినీ వర్గాల అభిప్రాయం. ఈ మార్పు కారణంగా గోపీచంద్ కొంత అసంతృప్తికి గురైనట్లు సమాచారం. పిలిచి చర్చించిన తర్వాత పాత్ర మారడం తనకు ఇబ్బందిగా అనిపించిందని అప్పట్లో ఇండస్ట్రీలో ప్రచారం జరిగినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ, ‘ఒక్కడు’లో ఓబుల్ రెడ్డి పాత్రకు వచ్చిన గుర్తింపు ఇప్పటికీ ప్రత్యేకంగానే నిలిచింది.



## వెంకటేష్–కృష్ణవంశీ కలయిక ఎందుకు సాధ్యపడలేదు?

**డేట్స్ సమస్యతో మిస్ అయిన ఫ్యామిలీ చిత్రం**

తెలుగు సినిమా పరిశ్రమలో వెంకటేష్‌కు ప్రత్యేక స్థానం ఉంది. కుటుంబ ప్రేక్షకుల్లో ఆయనకు ఉన్న ఆదరణ ఇతర హీరోలకంటే భిన్నం. ఒకప్పుడు శోభన్‌బాబు కుటుంబ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించిన విధంగా, ఆ తరువాత అదే స్థాయిలో ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకున్న హీరోగా వెంకటేష్ గుర్తింపు పొందారు. ప్రస్తుతం విభిన్న కథలతో సినిమాలు చేస్తూనే మల్టీ స్టారర్ ప్రాజెక్ట్‌ల్లోనూ నటిస్తున్నారు. ఇటీవల ‘మన శంకరా వరప్రసాద్’ చిత్రంలో ప్రత్యేక పాత్ర పోషించి సినిమా విజయానికి కీలకంగా నిలిచారు. ఇదే సమయంలో క్రియేటివ్ దర్శకుడిగా గుర్తింపు పొందిన కృష్ణవంశీ దర్శకత్వంలో ఒక ఫ్యామిలీ సినిమా చేయాలనే ఆలోచన కూడా జరిగినట్లు సమాచారం. ‘నిన్నే పెళ్లాడతా’ తర్వాత కృష్ణవంశీ, వెంకటేష్ కలయికలో సినిమా రూపొందాల్సి ఉండగా, అనుకోని కారణాలతో అది కార్యరూపం దాల్చలేదు. ఆ సమయంలో వెంకటేష్ వరుసగా నాలుగు చిత్రాలకు కమిట్ కావడంతో డేట్స్ సమస్య తలెత్తిందని సినీ వర్గాలు తెలిపాయి. దీంతో ఆ కాంబినేషన్‌లో సినిమా మిస్ అయింది. కృష్ణవంశీ దర్శకత్వంలో ‘నిన్నే పెళ్లాడతా’లో నాగార్జున పోషించిన పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అప్పటివరకు కనిపించని కొత్త నటనను బయటకు తీసుకొచ్చిన ఘనత దర్శకుడికే దక్కింది. ఆ తరువాత ‘సింధూరం’, ‘చంద్రలేఖ’, ‘అంతఃపురం’ వంటి చిత్రాలతో ఆయన తన ముద్ర వేశారు.

అయితే ఇటీవల కృష్ణవంశీ నుంచి వచ్చిన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోతున్నాయి. మరోవైపు వెంకటేష్ వరుస సినిమాలతో ముందుకు సాగుతున్నారు. వీరిద్దరి కలయికలో మరోసారి సినిమా రూపుదిద్దుకుంటుందా అనే అంశం సినీ అభిమానుల్లో ఆసక్తిగా మారింది.





## ఎల్లో చీరలో మెరిసిపోతున్న ఆకాంక్ష పూరి

ప్రముఖ నటి ఆకాంక్ష పూరి తన తాజా ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తున్నారు. ప్రముఖ ఫోటోగ్రాఫర్ అమిత్ ఖన్నా క్లిక్ చేసిన ఈ చిత్రాల్లో ఆకాంక్ష పసుపు రంగు చీరలో దేవకన్యలా కనిపిస్తున్నారు.ఎటువంటి భారీ ఆభరణాలు లేకుండా, చాలా సింపుల్ అండ్ మినిమల్ మేకప్‌తో ఆమె తన సహజ అందాన్ని చాటుకున్నారు.చీరకట్టులో ఆకాంక్ష కనబరిచిన హుందాతనం మరియు నాజూకుతనం అభిమానులను ఫిదా చేస్తోంది.ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. "సింప్లిసిటీ అంటే ఇదే" అంటూ నెటిజన్లు ఆమెపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



## హృతిక్ నడకలో మార్పు.. అభిమానుల్లో కలవరం

బాలీవుడ్‌లో సూపర్ హీరో ఇమేజ్‌తో గుర్తింపు తెచ్చుకున్న నటుడు హృతిక్ రోషన్ మరోసారి వార్తల్లోకి వచ్చాడు. ‘క్రిష్’, ‘ధూమ్ 2’ చిత్రాలతో భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చిన హృతిక్, తాజాగా వాకింగ్ స్టిక్‌తో నడుస్తూ కనిపించాడు. ఇటీవలే పుట్టినరోజు వేడుకల్లో పూర్తి ఫిట్‌నెస్‌తో దర్శనమిచ్చిన ఆయన, ఇలా చేతికర్ర ఆధారంగా నడవడం అభిమానుల్లో ఆందోళనకు దారి తీసింది.

సాధారణంగా ఫొటోగ్రాఫర్లను చిరునవ్వుతో పలకరించే హృతిక్, ఈసారి మాత్రం ఎలాంటి స్పందన లేకుండా నేరుగా తన కారు వైపు వెళ్లాడు. ఆయన నడకలో కనిపించిన ఇబ్బందిని గమనించిన పలువురు, మోకాళ్లకు గాయాలు అయ్యి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆరోగ్య పరిస్థితిపై చర్చ మొదలైంది. ఇటీవలే తన 52వ పుట్టినరోజును హృతిక్ జరుపుకున్నారు. ఆ వేడుకకు మాజీ భార్యతో పాటు సన్నిహితులు హాజరుకావడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అలాంటి వేడుక జరిగిన కొద్ది రోజులకే ఆయన ఇలా కనిపించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



చివరిగా హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌తో కలిసి భారీ యాక్షన్ చిత్రం ‘వార్ 2’లో నటించాడు. ఈ చిత్రంలో ఆయన లుక్, ఫిట్‌నెస్‌పై ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, కఠినమైన వ్యాయామాలు, నియమిత ఆహార విధానమే ఈ వయసులోనూ ఆయన ఫిట్‌నెస్‌కు కారణమని సినీ వర్గాలు చెబుతున్నాయి.

ఇదిలా ఉండగా, నటుడిగానే కాక దర్శకుడిగా కూడా కొత్త ప్రయాణానికి హృతిక్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ‘క్రిష్ 4’ చిత్రాన్ని ఆయనే దర్శకత్వం వహించనున్నారని బాలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంపై ఎలాంటి అధికారిక సమాచారం వెలువడకపోయినా, అభిమానులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు.

## కోలీవుడ్‌లో మరో అవకాశం కొట్టేసిన శ్రీలీల

తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ శ్రీలీల ఇప్పుడు కోలీవుడ్ వైపు అడుగులు వేస్తోంది. తెలుగులో వరుస సినిమాలతో బిజీగా కనిపించిన ఈ భామ, ఇటీవల తమిళంలో కూడా అవకాశాలు అందుకుంటోంది. తాజాగా నటుడు ప్రదీప్ రంగనాథన్ తెరకెక్కించబోయే కొత్త సైన్స్ ఫిక్షన్ చిత్రంలో శ్రీలీల కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం చర్చలు సాగుతున్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి.





## ఎవరి కోసం ఈ ఎదురుచూపులు సుందరి?

మిస్ ఇండియా కిరీటాన్ని కైవసం చేసుకున్న తెలుగు తేజం మనసా వరణాసి, తన స్టైల్‌తో మరోసారి నెటిజన్ల మనసు గెలుచుకుంది. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు ఫ్యాషన్ వరల్డ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.ఈ ఫోటోల్లో మనసా అందమైన పూల డిజైన్‌తో కూడిన చీరలో మెరిసిపోతోంది. సంప్రదాయక కట్టుకు ఆధునిక హంగులు అద్దడంలో ఆమె తనదైన ముద్ర వేసింది.కేవలం అందాల పోటీల విజేతగానే కాకుండా, ఫ్యాషన్ ఐకాన్‌గా కూడా మనసా దూసుకుపోతోంది. ఈ లేటెస్ట్ లుక్ చూసిన అభిమానులు “గ్రేస్‌ఫుల్”, “క్లాసీ” అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. పద్ధతిగా ఉంటూనే ట్రెండీగా ఎలా ఉండాలో మనసాను చూసి నేర్చుకోవచ్చని ఫ్యాషన్ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా, తన సహజ సిద్ధమైన అందంతో, చిరునవ్వుతో మనసా వరణాసి షేర్ చేసిన ఈ ఫోటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com